

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

## వైఎస్సార్ శుద్ధజల కేంద్రం ప్రారంభించిన వైసీపీ నాయకులు

తుగ్గలి మండల పరిధిలోని జిఎర్రగుడి గ్రామంలో ఏర్పాటు చేసిన వైయస్సార్ శుద్ధజల కేంద్రాన్ని బుధవారం జిల్లా నాయకులు రామచంద్రారెడ్డి,మండల కన్వీనర్ జిట్టానగేష్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృఢ సంకల్పంతో కృషిచేస్తున్నారని తెలిపారు. నాలుగు రూపాయలకే 20 లీటర్ల శుద్ధ జలాన్ని ప్రజలకు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.గ్రామంలో తక్కువ ధరకు మినరల్ వాటర్ అందుబాటులో రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 03 జూన్ 2021 సంపుటి : 02 సంచిక :317 పేజీలు : 4 వెల : రూ 3-00

# అనుకున్న సమయంలోగా లక్ష్యాలను చేరాలి: సీఎం జగన్



### జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంపై సమీక్ష
### సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ
### సచివాలయాల్లోనే అన్ని సర్టిఫికెట్లు లభించేలా చూడాలి: సీఎం జగన్

తాడేపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "భూసర్వే చురుగ్గా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. కోవిడ్‌తో మంద గమనంలో ఉన్న పథకం పరుగులు పెట్టాలి. లక్ష్యాలను అనుకున్న సమయంలోగా చేరాలి. క్రమం తప్పకుండా దీనిపై సమీక్షలు చేయాలి. అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి. పథకాన్ని పూర్తి చేయడానికి అంకిత భావంతో ముందుకెళ్లాలి. సచివాలయాల్లో రిజి(స్ట్రేషన్ ప్రక్రియ కొనసాగాలి. పట్టణాల్లో కూడా సమగ్ర సర్వే వెంటనే వేగం చేయండి. అందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలి. సర్వే పూర్తైతే అన్నింటికి క్లియర్ టైటిల్స్ వస్తాయి. ఎక్కడా భూ వివాదాలకు అవకాశం ఉండదువవ అన్నారు"మారుమూల ప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో సర్వేకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోండి. అక్కడ సిగ్నల్స్ సమస్యలు ఉంటాయి కాబట్టి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోండి. సర్వే పనులకు ఇబ్బంది కలగకుండా కావాల్సిన వాటి కోసం ఆర్డర్ చేయండి. సర్వే ఆలస్యంగా కాకుండా చర్యలు తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ 2023 నాటికి రాష్ట్రంలో సమగ్ర భూసర్వే పూర్తి కావాలివవ అని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు."ప్రజలకు అన్నిరకాల సేవలు అందించేలా గ్రామ, వార్డు సచివాలయాలు తయారు కావాలి. ప్రస్తుతం అందిస్తున్న జనన, మరణ ధృవీకరణ పత్రాల్లానే అన్నిరకాల సర్టిఫికెట్లు వారికి సచివాలయాల్లోనే అందేలా చూడాలి. సిబ్బంది శిక్షణ కార్యక్రమాల మాన్యువల్‌ను డిజిటల్ ఫార్మాట్‌లో పెట్టి.. వారు ఎప్పుడు కావాలంటే.. అప్పుడు డౌన్‌లోడ్ చేసుకుని సందేహాలు తీర్చుకునేలా అందుబాటులో ఉంచాలి. యూజర్ మాన్యువల్, తరచుగా వచ్చే ప్రశ్నలకు సందేహాలు వారికి అందుబాటులో డిజిటల్ ఫార్మాట్‌లో ఉంచాలి. సచివాలయాల్లోని సిబ్బందికి ఇస్తున్న అన్నిరకాల శిక్షణ కార్యక్రమాలకు సంబంధించి ఈ ఫార్మాట్‌లో ఉంచాలి. అలాగే ఒక డిజిటల్ లైబ్రరీని అందుబాటులో ఉంచాలివవ అని సీఎం జగన్ సూచించారు. కాగా, రాష్ట్రంలో సర్వే పురోగతిపై సమావేశంలో అధికారులు వివరిస్తూ.. ఇప్పటికే 70 బేస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, అవి పూర్తి కచ్చితత్వంతో పని చేస్తున్నాయని వెల్లడించారు. సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో మరి కొన్ని గ్రౌండ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామని, అదే విధంగా అవసరమైనన్ని డ్రోన్లను రంగంలోకి దించుతామని అధికారులు వివరించారు. సర్వేలో పైలట్ ప్రాజెక్టు ఇప్పటికే దాదాపు పూర్తి కాగా, తొలి దశలో 4,800 గ్రామాల్లో సర్వే చేపడుతున్నామని అధికారులు తెలిపారు. ఆ గ్రామాల్లో సమగ్ర సర్వే పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబరు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు రికార్డుల ప్యూరిఫికేషన్ పూర్తి చేసి, ముసాయిదా ముద్రిస్తామని చెప్పారు.కాగా, పట్టణాలు, నగరాల్లో కూడా సర్వేకు సంబంధించి ఇప్పటికే పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో సర్వే మొదలు పెట్టామని మున్సిపల్ అధికారులు వెల్లడించారు. మిగిలిన పట్టణాలు, నగరాలకు సంబంధించి.. ఫేజ్ -1. జూన్ 2021లో ప్రారంభమై జనవరి 2022 కల్లా 41 పట్టణాలు, నగరాల్లో. ఫేజ్ -2. ఫిబ్రవరి 2022లో ప్రారంభమై, అక్టోబరు 2022 నాటికి 42 పట్టణాలు, నగరాల్లో. ఫేజ్ -3. నవంబర్ 2022లో ప్రారంభమై, ఏప్రిల్ 2023 నాటికి 41 పట్టణాలు, నగరాల్లో పూర్తి చేస్తామని మున్సిపల్ అధికారులు వివరించారు.ఉప ముఖ్యమంత్రి (రెవెన్యూ మంత్రి) ధర్మాన కృష్ణదాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజేయ కల్లం, భూపరిపాలన చీఫ్ కమిషనర్ నీరబ్‌కుమార్ ప్రసాద్, రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ, పంచాయితీరాజ్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వై శ్రీలక్ష్మి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి వి.ఉషారాణి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.గిరిజాశంకర్, రెవెన్యూ కమిషనర్ (సర్వే, సెటిల్‌మెంట్స్ అండ్ లాండ్ రికార్డ్స్) సిద్దార్థ జైన్, స్టాంప్స్ అండ్ రిజి(స్ట్రేషన్ విభాగం ఐజీ ఎంవీవీ శేషగిరిబాబుతో పాటు, వివిధ శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు.

# 'విపత్కర పరిస్థితుల్లోనూ పోలవరం పనుల్లో పురోగతి చూపిస్తున్నాం



పశ్చిమగోదావరి: కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ పోలవరం పనుల్లో పురోగతి చూపిస్తున్నామని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. పోలవరంలో మంత్రి అనిల్‌కుమార్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎగువ కాఫర్ డ్యామ్, అప్రోచ్ ఛానెల్ మట్టితవ్వకం పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అప్రోచ్ ఛానెల్ మట్టితవ్వకం పనులు కొనసాగుతున్నాయని, 2022 ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. 2016 నుంచి పోలవరం ప్రాజెక్ట్ కోసం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఏమి చేసిందని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో ప్రపంచం మొత్తం ఇబ్బంది పడుతున్నా.. పనుల్లో పురోగతి చూపిస్తున్నామన్నారు. మెగా సంస్థలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులు, అయిదుగురు అధికారులను కోల్పోయినందుకు నిజంగా తమకు బాధ అనిపిస్తోందన్నారు. జూమ్ మీటింగ్‌లతో టీడీపీ నాయకులు కాలం వెళ్ల దీస్తున్నారని, తెలుగుదేశం పార్టీ వాళ్లు ఎవ్వరూ ఇంటి నుంచి బయటకు రావటం లేదని విమర్శించారు. సోషల్ మీడియాలో పనికి మాలిన వెదవలు కామెంట్స్ చేస్తున్నారని మండిపడ్డారు.'ఇలాంటి కష్టకాలంలో పని చేస్తున్న కార్మికులు, అధికారులను అభినందనిస్తున్నాం. స్పిల్ వే కట్టిన తర్వాత కాపర్ డ్యాం కట్టాల్సి ఉండగా అలా చేయకపోవటం వల్ల డయా ఫ్రం వాల్ దెబ్బ తిన్నది. దీన్ని ఎలా అధిగమించాలని ఆలోచిస్తున్నాం. చంద్రబాబు వాళ్లకు భజన చేసే వాళ్లవే ప్రాణాలు. 2022 ఖరీఫ్ కు పనులు పూర్తవుతాయని చెప్పాం. దానికే కట్టుబడి ఉన్నాం. 1.50 లక్షల అప్రోచ్ ఛానల్ తీసే పనులు జరుగుతున్నాయివ అని తెలిపారు.

# పాక్‌తో కలిసి వాస్తవాధీన రేఖ వద్ద మిస్సైళ్లను పరీక్షిస్తున్న చైనా



చండీఘడ్: చైనా, పాకిస్థాన్ దేశాలు టిబెట్‌లో సంయుక్తంగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. వాస్తవాధీన రేఖ వెంట జరుగుతున్న ఈ పరిణామంపై అందరి దృష్టి పడింది. యుద్ధ నౌకలను టార్గెట్ చేయడంతో పాటు సముద్రం నుంచి ల్యాండ్ అటాక్‌ను చేపట్టే రీతిలో విన్యాసాలు సాగుతున్నాయి. వైమానిక రక్షణ నైపుణ్యాలను కూడా పెంచుకుంటున్నారు. శత్రు విమానాలను, మిస్సైళ్లు, యూఏవీలను టార్గెట్ చేయడం లాంటి అంశాల్లో రెండు దేశాలు శిక్షణ పొందుతున్నాయి. ఇటీవల చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అన్ని యూనిట్లను ఎయిర్ డిఫెన్స్‌తో ఏకీకృతం చేసింది. వాస్తవాధీన రేఖ వెంట పీఎల్ఏ ఎయిర్‌ఫోర్స్ దళం పటిష్టంగా తయారవుతున్నట్లు ఓ మీడియా సంస్థ కథనం రాసింది. పాక్, చైనా సంయుక్త సైనిక విన్యాసాలు మే 22వ తేదీ న ప్రారంభమైనట్లు తెలుస్తోంది. అయితే ఆ విన్యాసాలు ఈ వారం చివర వరకు సాగనున్నాయి.నిజానికి చైనా, పాకిస్థాన్ అప్పుడప్పుడు సైనిక విన్యాసాలు నిర్వహిస్తూనే ఉంటాయి. కానీ భారత్, చైనా మధ్య ఉన్న లడాఖ్ ప్రతిష్టంభనకు ఏడాది పూర్తి కావస్తున్న తరుణంలో ఈ విన్యాసాలు ప్రత్యేకత సంతరించుకున్నాయి. టిబెట్ శిక్షణలో ఎంత మంది పాక్ సైనికులు ఉన్నారో స్పష్టంగా తెలియదు. కానీ చైనా వైపు మాత్రం.. 3 ఎయిర్ డిఫెన్ డివిజన్‌కు చెందిన దళాలన్నీ భాగస్వామ్యం అవుతున్నాయి. సైనిక శిక్షణలో పాకిస్థాన్ వినియోగిస్తున్న మిస్సైళు ఇక నుంచి పీఎల్ఏ నేవీ దళంలోనూ కనిపించే అవకాశాలు ఉన్నాయి. పాక్ యుద్ధ నౌకలు కూడా ఆ మిస్సైళ్లను మోసుకువేళ్లే చాన్సు ఉంది. దీని వల్ల సరిహద్దు వెంట భారతీయ పైలెట్లు, డ్రోన్లు, మిస్సైళ్లు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.ఎల్‌వై-80 వైమానిక రక్షణ వ్యవస్థను చైనా ఇప్పటికే వాడుతున్నది. దీని గురించి ఇండియాకు ముందే తెలుసు. 150 కిలోమీటర్ల రేంజ్ వరకు ఈ సర్ఫేస్ టు ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ పనిచేస్తుంది. మధ్య స్థాయి ఎత్తులో ప్రయాణించే ఏరియల్ టార్గెట్‌ను గుర్తించి ఆ మిస్సైల్ సిస్టమ్ ధ్వంసం చేయగలదు. ప్రస్తుత శిక్షణలో వాడుతున్న మిస్సైల్స్‌లో ఎస్ఎం-6, ఈగల్ యాంటీ షిప్ మిస్సైల్స్, సీ-802 యాంటీ షిప్ క్రూయిజ్ మిస్సైల్‌లు ఉన్నాయి. 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను సీ802 మిస్సైల్ పేల్చేస్తుంది. దీన్ని ఫైటర్ జెట్ నుంచి కూడా ప్రయోగించవచ్చు. టిబెట్‌లో ఉన్న సరస్సులు, చెరువుల్లో డమ్మీ షిప్‌లపై ఈ మిస్సైళ్లను పరీక్షిస్తున్నారు. పీఎల్‌ఏలోని వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌లో ఉన్న పది యూనిట్లు ఇప్పుడు ఏకీకృతంగా పనిచేస్తున్నాయి.

# ఏపీలో కొత్తగా 12,768 కరోనా కేసులు

అమరావతి: గత 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో 98,048 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 12,768 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 17,14,261 మందికి కరోనా వైరస్ సోకింది. నిన్న ఒక్కరోజే కరోనా బారిన పడి 98 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 11,132కు చేరింది. గడిచిన 24 గంటల్లో 15,612 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 15 లక్షల 62 వేల 229 మంది డిశ్చార్జ్ అయ్యారు.ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బుధవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 1,43,795 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో నేటి వరకు 1,94,48,056 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.




# క్రిమినల్ కేసులు పెడతాం...

### మంత్రి కన్నబాబు సీరియస్ వార్నింగ్

విశాఖ: కోవిడ్ నియంత్రణ చర్యలపై మంత్రి కన్నబాబు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 శాతం కరోనా పాజిటివ్ రేటు ఉందన్నారు. ఆక్సిజన్, వెంటిలేటర్ బెడ్స్..అందరికి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 70 పైగా ఆసుపత్రిలో కరోనా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. 7 కోవిడ్ కేర్ సెంటర్స్ నడుస్తున్నాయని పేర్కొన్నారు. విశాఖలో 113బ్లాక్ ఫంగస్ కేసులు నమోదు అయ్యాయన్నారు. ఫంగస్ చికిత్స కోసం 9 ఆసుపత్రులను సిద్ధం చేశామని చెప్పారు. విశాఖలో వ్యాక్సినేషన్ 27 కేంద్రాల్లో జరుగుతోందన్నారు. కోవిడ్ చికిత్సను ఆరోగ్య శ్రీలో చేర్చామని, ప్రైవేటు ఆసుపత్రులు రోగులను పీడించవద్దని కోరామని చెప్పారు. ఆసుపత్రులపై 57 లక్షలు పెనాల్టీ వేశామని స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని వ్యాఖ్యానించారు. శ్మశానాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేశామని, ఎవరైనా డబ్బులు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కన్నబాబు హెచ్చరించారు.



# కొవిడ్ వ్యాక్సిన్లపై మేథో సంపత్తి హక్కుల రద్దుకు హర్షవర్ధన్ పిలుపు

న్యూఢిల్లీ : కరోనా మహమ్మారి ప్రపంచాన్ని పీడిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో మేథో సంపత్తి హక్కుల (ఐపీఆర్) విషయంలో పరిశ్రమ పట్టుదలతో ఉండేందుకు అవకాశం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ పేర్కొన్నారు. కొవిడ్-19 వ్యాక్సిన్లపై ఐపీఆర్ ఎత్తివేతను కోరుతూ ఉమ్మడి సవాళ్లను సమిష్టి బాధ్యతతోనే ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. రాబోయే రెండు దశాబ్దాల్లో పలు తక్షణ ఆరోగ్య సవాళ్లు ఎదురుకానున్నాయని, దేశాలన్నీ ఒక స్ఫూర్తితో ముందుకు కదలాల్సిన అవసరం నెలకొందని అన్నారు.డబ్ల్యూహెచ్ఓ ఎగ్జిక్యూటివ్ బోర్డు చైర్మన్ గా హర్ష వర్ధన్ పదవీకాలం పూర్తయిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారం, గొంతుక లేని సామాన్యుల ప్రాణాలను కాపాడేందుకు ఇదే సరైన సమయమని ప్రపంచమంతా ఒకటే అనే స్ఫూర్తిని చాటేందుకు దేశాలన్నీ ఒక్కటి కావాలని పిలుపు ఇచ్చారు. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంపద లేని వారికీ వ్యాక్సిన్లు అందుబాటులోకి రావాలని డాక్టర్ హర్షవర్ధన్ కోరారు.

# థర్డ్ వేవ్ మరింత ప్రమాదకరం : ఎస్ బీఐ రిపోర్ట్

న్యూఢిల్లీ : కొవిడ్-19 సెకండ్ వేవ్ కంటే థర్డ్ వేవ్ తీవ్రత మరింత అధికంగా ఉంటుందని ఎస్‌బీఐ నివేదిక హెచ్చరించింది. మనం ముందస్తుగా సన్నద్ధమైతే కరోనా మరణాల సంఖ్యను తగ్గించవచ్చని పేర్కొంది. ఎస్‌బీఐ ఎకోరాప్ నివేదిక ప్రకారం కొవిడ్-19 సెకండ్ వేవ్ 98 రోజుల పాటు ఉంటుందని తెలిపింది. అగ్రదేశాల్లో థర్డ్ వేవ్ సగటున 98 రోజులు ఉంటుందని, సెకండ్ వేవ్ వ్యవధి 108 రోజులని పేర్కొంది. కొవిడ్ సెకండ్ వేవ్ కంటే థర్డ్ వేవ్ తీవ్రత అధికమని అంతర్జాతీయ అనుభవం వెల్లడిస్తోందని తెలిపింది.థర్డ్ వేవ్ కు మనం సన్నద్ధమైతే సీరియస్ కేసుల సంఖ్య తగ్గించడం ద్వారా మరణాల రేటును పరిమితం చేయవచ్చని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. వ్యాక్సినేషన్ ముమ్మరం చేయడం, ఆరోగ్య మౌలిక వసతుల పెంపు వంటి సన్నద్ధత సాధిస్తే థర్డ్ వేవ్ లో మరణాల సంఖ్యను 40,000కు తగ్గించవచ్చని అంచనా వేసింది. సెకండ్ వేవ్ లో ఇప్పటికే 1.7 లక్షలకు పైగా కరోనా మరణాలతో పోలిస్తే ముందస్తు ఏర్పాట్లతో థర్డ్ వేవ్ ను సమర్థంగా మనం కట్టడి చేయవచ్చని తెలిపింది. థర్డ్ వేవ్ చిన్నారులపై ప్రభావం చూపుతుందనే అంచనాల నడుమ వారికి వ్యాక్సినేషన్ చేపట్టడం కీలకంగా ముందుకు సాగాలని పేర్కొంది.



# మోదీ ప్రభుత్వానిది చారిత్రక వైఫల్యం: తులసిరెడ్డి

అమరావతి: కరోనా టీకా విషయంలో మోదీ ప్రభుత్వానిది చారిత్రక వైఫల్యమని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీకా సేకరణ విధానం, ధరల విధానం లోపభూయిష్టమని తప్పుబట్టారు. కరోనా టీకా కార్యక్రమం నత్తనడకన సాగుతోందని విమర్శించారు. అందరికీ టీకా ఉచితంగా వేయాలని, కేంద్రమే పూర్తిబాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. 1978 నుంచి అమలవుతున్న జాతీయ సార్వత్రిక ఉచిత టీకా విధానం నుంచి.. మోదీ ప్రభుత్వం పక్కకు తొలగించడం దురదృష్టకరమ న్నారు. ఈ ఏడేళ్లలో కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సినది కొండంత. ..ఇచ్చింది గోరంత అని తులసిరెడ్డి దుయ్యబట్టారు.



# సంపాదకీయం

గురువారం 03 జూన్ 2021

## క్యాష్ ఇంజక్షనే మందా...

కరోనా మహమ్మారి దెబ్బకు దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత కనిష్ఠంగా 23.9 శాతం తగ్గింది. 1996లో త్రైమాసిక ఆర్థిక గణన విధానాన్ని తీసుకొచ్చినప్పటి నుంచి ఇంత తక్కువ జీడీపీ నమోదు కావడం ఇదే తొలిసారి. ఈ మేరకు కేంద్ర గణాంక కార్యాలయం(ఎన్ఎస్ఓ) సోమవారం వెల్లడించింది. దాని ప్రకారం.. 2020-21 ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7.3 శాతం క్షీణత నమోదు చేసింది.దేశంలో గతేడాది కరోనా లాక్‌డౌన్ విధించడం, ఆర్థిక కార్యకలాపాలన్నీ నిలిపివేయడంతో ఆర్థిక వృద్ధి పడిపోయింది. దీంతో దేశ జీడీపీ 4 దశాబ్దాల దిగువకు కుదేలైంది. 1980 సయమంలో ఇంత తక్కువ జీడీపీ నమోదైందు కాగా.. మళ్లీ ఇప్పుడు అదే తరహా జీడీపీ గణాంకాలు నమోదయ్యాయి. ఇక 2020-21 తొలి త్రైమాసికం(జనవరి-మార్చి)లో జీడీపీ 1.6 శాతం వృద్ధిని నమోదుచేయగా.. మూడో త్రైమాసికంలో 1.1 శాతం నమోదు చేసింది. అంటే 0.5 శాతం పెరుగుదల నమోదు చేసింది. కానీ 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికంలో 3 శాతం వృద్ధి నమోదైంది.అంతకుముందు ఏడాది (2019-20) ముఖ్యంగా తయారీ, నిర్మాణ రంగాల్లో స్తబ్ధత కారణంగా దేశ జీడీపీ 4.2 శాతానికే పరిమితమైంది. ఇది 11 ఏళ్ల కనిష్ఠం. కరోనా మహమ్మారి చుట్టు ముట్టడంతో 2020-21 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏకంగా 24.38 శాతం క్షీణత నమోదైంది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది జనవరిలో వెలువరించిన తొలి విడత అంచనాల్లో 7.7 శాతం క్షీణతకు చేరే అవకాశం ఉందని నిపుణులు తెలుపగా.. ఆ తర్వాత 8 శాతం వరకు దిగజారే అవకాశం ఉందని ఎన్ఎస్ఓ హెచ్చరించింది. అయితే పక్క దేశం చైనా జనవరి - మార్చి త్రైమాసికంలో 18.3 శాతం వృద్ధి రేటును నమోదు చేయడం గమనార్హం.దాదాపు నలభై ఏళ్ల తర్వాత భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు మైనస్ స్థాయికి పడిపోయింది. 1979-80 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు మైనస్ 5.2 శాతంగా నమోదైన తర్వాత మళ్లీ ఈ స్థాయిలకు పడిపోవటం ఇదే మొదటిసారి. దీంతో 2019-20 ఆర్థిక సంవత్సరం రూ.145 లక్షల కోట్లుగా ఉన్న జీడీపీ 2020-21లో రూ.135 లక్షల కోట్లకు పడిపోయింది. భారత జీడీపీ మళ్లీ రూ.145 లక్షల కోట్ల స్థాయికి చేరాలంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2021-22)లో వృద్ధి రేటు 10 నుంచి 11 శాతం మేర నమోదు కావాల్సి ఉంటుంది. అయితే కొవిడ్ రెండో ఉధృతి నేపథ్యంలో ఇది సాధ్యమయ్యే సూచనలు కనిపించడం లేదు. ఇప్పటికే వినియోగం గణనీయంగా పడిపోయింది. నిరుద్యోగమూ 14 శాతం దాటి ఏడాది గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో ఏదైనా అద్భుతాలు జరిగితే తప్ప, జీడీపీ వృద్ధి రేటు పెద్దగా పెరిగే అవకాశాలు కనిపించడం లేదని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటు జీడీపీలో 9.3 శాతం (రూ.18,21,461 కోట్లు)గా నమోదైంది. సవరించిన 2020- 21 బడ్జెట్ అంచనాల కంటే ఇది 0.2 శాతం తక్కువ. పన్ను వసూళ్లు అంచనాలకు మించి వసూలు కావడం ఇందుకు ప్రధాన కారణం. అందుబాటులో ఉన్న తాత్కాలిక అంచనాల ప్రకారం 2020-21 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.16,89,720 కోట్లు అందాయి. బడ్జెట్ అంచనాల కంటే ఇది 5.5 శాతం ఎక్కువ. కొవిడ్ ప్రభావం తగ్గి, గత ఏడాది అక్టోబరు నుంచి ఆర్థిక కార్యకలాపాలు పునఃప్రారంభం కావడం ఇందుకు ప్రధానంగా దోహదం చేసింది. ప్రభుత్వం తన విపరీత విధానాలను విడిచిపెట్టి, ఎక్కువ కరెన్సీ నోట్లు ముద్రించి, అందుకు తగ్గట్టు వ్యయం పెంచాలని, మరో ఆర్థిక సంవత్సరం వ్యర్థం కాకుండా చూడాలని ఆర్థిక నిపుణులు చేసిన సలహాను పాటించాలని కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికింది. గత నాలుగు దశాబ్దాల్లో అత్యంత చీకటి సంవత్సరంగా 2020-21 నిలుస్తుందని వ్యాఖ్యానించారు. 2020-21 నాటి పరిస్థితి 2021-22లో పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకోవాలని, తప్పులు ఒప్పుకోవాలని, పాలనా విధానాలను మార్చుకోవాలని ఆర్థిక నిపుణులు, విపక్షాల సలహాలను తీసుకోవాలని చిదంబరం సూచించారు.కరోనా మహమ్మారి ప్రభావం దేశ ఆర్థిక పరిస్థితిపై తీవ్రంగా పడిందనడంలో ఎలాంటి సందేహం లేదని, అయితే బిజెపి సారథ్యం లోని ఎన్‌డిఎ ప్రభుత్వఅసమర్థ ఆర్థిక నిర్వహణతో ఈ కష్టాలు మరింత ఎక్కువయ్యాయని చిదంబరం పేర్కొన్నారు. ద్రవ్యలోటు గురించి ఎక్కువగా ఆందోళన చెందకుండా ప్రస్తుత తరుణంలో కొత్తగా రుణాలైనా తీసుకురావాలని, లేదా కరెన్సీని ముద్రించాలని సూచించారు. 2020-21 సంవత్సరానికి జిడిపి మైనస్ 7.3 శాతానికి పడిపోయిన నేపథ్యంలో ఆయన స్పందిస్తూ డబ్బును విరివిగా ఖర్చు చేయాల్సిన సందర్భం వచ్చిందన్నారు. ఆత్మనిర్భర్ వంటి ఉత్త పథకాలు వల్ల ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గత ఏడాది కరోనా తగ్గుముఖం ఉన్నట్టు కనిపించినప్పుడు ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్, ఆమె ప్రధాన ఆర్థిక సలహాదారు ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోందని కథలు వినిపించారని, విస్పీడ్ రికవరీ అంటూ జోస్యం చెప్పారని కానీ అంతకు మించి చేసిందేమీ లేదని వ్యాఖ్యానించారు. కోలుకునే సంకేతాలు లేవంటూ గతంలో తాము హెచ్చరించామని, ప్రభుత్వ వ్యయం పెంచాలని, పేద ప్రజలకు నగదు బదిలీ చేయాలని, ఉచిత రేషన్ అందరికీ అందించాలని చెప్పామని, తమ విజ్ఞప్తులన్నీ పెడచెవిన పెట్టారని, ఇప్పటి ప్రతికూల వృద్ధికి ఇదే కారణమని చిదంబరం ఆరోపించారు.

# హేమా హేమీలు గప్ చుప్

ఏలూరు, జూన్ 2, (న్యూస్ పల్స్)ప్రధాన ప్రతిపక్షం టీడీపీకి కంచుకోట వంటి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆ పార్టీ జెండా మోసే నాయకులు, పార్టీని నడిపించే నాయకులు కూడా కనిపించడం లేదు. గత ఎన్నికల్లో ఓటమి నుంచి పలు గ్రామాల్లో కేడర్ నిర్వేదంలోకి వెళ్లిపోయింది. ఎక్కడికక్కడ కీలక నేతలు, కేడర్ వైసీపీలోకి వెళ్లిపోతున్నా.. నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు చేష్టలుడిగి చూడడం తప్పా చేసేదేం ఉండడం లేదు. 2014 ఎన్నికల్లో ఒక్క తాడేపల్లిగూడెం తప్ప ( ఇక్కడ కూడా మిత్రపక్షం బీజేపీ గెలిచింది) అన్ని నియోజకవర్గాల్లోనూ సైకిల్ విజయం సాధించింది. ఇక, 2019 ఎన్నికలకు వచ్చేసరికి.. ఇక్కడ కేవలం ఉండి, పాలకొల్లు తప్ప ఆ పార్టీకి మిగిలింది ఏమీలేదు. వీటిలోనూ ఒక్క పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాత్రమే కొంత యాక్టివ్‌గా ఉన్నారు. ఉండి ఎమ్మెల్యే రామరాజు.. అధికార పార్టీ నేతలతో మిలాఖత్ అయిపోయారనే వార్తలు వస్తున్నాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు ఏమైనా జరుగుతున్నాయని అంటే.. అది పాలకొల్లులో మాత్రమే.రామానాయుడు అటు నియోజకవర్గంలోనూ, ఇటు రాష్ట్ర స్థాయిలోనూ బలమైన వాయిస్ వినిపించడంతో పాటు అసెంబ్లీలో ఏకంగా ముఖ్యమంత్రి జగన్‌నే గట్టిగా టార్గెట్ చేస్తున్నారు. జిల్లాలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎంపీలు, ఎమ్మెల్యేలు.. మంత్రులుగా ఉండి కనుసైగతో జిల్లాను శాసించిన వారు ఒక్క ఓటమితో గప్‌చుప్ అయ్యారు. హేమాహేమీల్లాంటి టీడీపీ నాయకులు అనుకున్నవారు సైతం ఏమైపోయారో తెలియని పరిస్థితి. దీంతో జిల్లాలో తెలుగుదేశం ఖాళీ అయిపోయిందా ? చేవ చచ్చిందా అన్న అనుమానాలు కేడర్‌లో ఉన్నాయట. అసెంబ్లీ ఎన్నికల్లో తగిలిన ఎదురు దెబ్బ నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కోలుకుందామని జిల్లాలోని టీడీపీ నేతలు భావించారు. కానీ మరింత దెబ్బ తప్పలేదు. నేతలకే కాదు.. కేడర్‌కు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒక ప్రణాళిక ప్రకారం టీడీపీని నడిపించే నాయకులు లేడన్నది పార్టీ వర్గాలు చెప్పేమాట.పంచాయతీలు పోయాయి. మున్సిపాలిటీలలో ఒకటి రెండు వార్డులకే పరిమితమైన దుస్థితి నెలకొంది. ఇక పరిషత్ ఎన్నికల సరేసరి. జిల్లాలో వైసీపీ ఎత్తుగడల ముందు టీడీపీ నేతల వ్యూహాలు తేలిపోతున్నాయి. ఎదురు నిలబడటం కాదు కదా.. ఎదురు మాట్లాడే పరిస్థితి లేదు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లో మునుపటి దూకుడు లేదు. కేసుల వల్ల భయపడ్డారో ఏమో సైలెంట్ అయిపోయారు. చింతమనేని పరిస్థితిని చూసిన జిల్లాలోని ఇతర టీడీపీ నేతలు నాకెందుకు వచ్చిన గొడవలే అని సర్దుకున్నట్టు చెబుతున్నారు. మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, మాగంటి బాబుల అలికిడి లేదు. దాదాపు వీరి రాజకీయం ముగిసినట్టే. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జిల్లా అంతా తానే అన్నట్టుగా ఉన్న మాజీ జడ్పీచైర్మన్ ముళ్లపూడి బాపిరాజు స్థానికంగా కంటే విజయవాడలోనే ఎక్కువగా ఉంటోన్న పరిస్థితి.2004, 2009లో టీడీపీ అధికారంలో లేకపోయినా.. జిల్లాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో అభ్యర్థులు దొరక్క విలవిల్లాడాల్సిన దుస్థితి ఎదురైంది. జిల్లా నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఉన్నారు. మరో మాజీ మంత్రి జవహర్ కొవ్వూరులో పాగా వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇద్దరూ ఉన్నారంటే ఉన్నారు అంతే. యాక్టివ్‌గా మాత్రం లేరని పార్టీ సీనియర్లు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పార్టీని పట్టుకునే నాథుడు లేరనేది వాస్తవం. తిరుపతి ఉప ఎన్నిక ఎలానూ ముగిసిన నేపథ్యంలో మరి ఇప్పటికె _నా..పసుపు కోటపై చంద్రబాబు దృష్టి పెడతారో లేదో చూడాలి. ఎలాగూ సీమ, నెల్లూరు జిల్లాల్లో పార్టీ పుంజుకునే పరిస్థితి లేదు? మరీ పార్టీకి కంచుకోట లాంటి జిల్లాల్లో అయినా కోలుకోకుంటే బాబుకు కష్టమే అని చెప్పాలి.

# గొట్టిపాటిపై జగన్ దృష్టి

ఒంగోలు, జూన్ 2, (న్యూస్ పల్స్)ఏపీలో ప్రతిపక్ష టీడీపీని ఎంత చావు దెబ్బ కొట్టాలో అంత చావు దెబ్బ సీఎం జగన్ కొట్టేశారు. జగన్ వ్యూహాల్లో టీడీపీ తునాత?నకలు అవుతోంది. పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయే వాళ్ల సంగతి అలా ఉంటే ప్రస్తుతం పార్టీలో ఉన్న వారిలోనూ మనోధైర్యం సన్నగిల్లుతోంది. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలు జగన్ చెంత చేరిపోయారు. ఇక టీడీపీలో చంద్రబాబు, బాలయ్యను పక్కన పెడితే మిగిలిన 17 మంది ఎమ్మెల్యేల్లో గంటా పార్టీలో ఉన్నారో లేదో తెలియదు. ఇక పార్టీకి బలంగా ఉన్న నిమ్మల రామానాయుడు, ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, పయ్యావుల కేశవ్ లాంటి వాళ్లను కూడా ఏదోలా టీడీపీకి దూరం చేసే ప్రయత్నాలు అయితే వైసీపీ నుంచి జరుగుతున్నాయని తెలుస్తోంది. వీరందరిలోనూ గొట్టిపాటి రవికుమార్ చాలా స్ట్రాంగ్. ఆర్థికంగా కూడా బలంగా ఉన్న రవి.. రేపటి ఎన్నికల్లో అవసరాన్ని బట్టి ప్రకాశం జిల్లా అంతటికి అయినా టీడీపీ అభ్యర్థులకు ఆర్థిక సాయం చేసే సత్తా ఉన్న వ్యక్తి.గతంలో వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచిన గొట్టిపాటి రవికుమార్, తర్వాత టీడీపీలోకి జంప్ చేసి.. గత ఎన్నికల్లో ఆ పార్టీలో విజయం సాధించారు. ఇప్పుడు జగన్ దృష్టంతా రవిమీదే ఉన్నట్టు తెలుస్తోంది. అద్దంకిలో ఎలాగూ వైసీపీకి బలమైన క్యాండెట్ లేరు. ఇక గొట్టిపాటి రవికుమార్, వైసీపీకి ఎలాగూ అవసరం.. అంతే కాకుండా మనకు బలమైనా కాకపోయినా టీడీపీకి మాత్రం బలం కాకూడదు అన్న కోణంలోనే వైసీపీ ఆలోచన చేస్తోందట. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా ఇటు అద్దంకి సీటు గెలవడంతో పాటు జిల్లాలో గొట్టిపాటి రవికుమార్, టీడీపీకి బలం కాకుండా ఉంటే? వైసీపీ స్వీప్ చేస్తుందన్నదే జగన్ ప్లాన్‌గా తెలుస్తోంది. గత ఎన్నికల్లో పలు జిల్లాలు వైసీపీకి స్వీప్ అయితే? వైసీపీ కంచుకోట అయిన ప్రకాశం జిల్లాలో టీడీపీ ఏకంగా నాలుగు సీట్లు గెలిచింది. పశ్చిమ ప్రకాశంలో టీడీపీ అభ్యర్థులతో పాటు బాపట్ల పార్లమెంటు పరిధిలో కొందరు టీడీపీ అభ్యర్థులకు గొట్టిపాటి రవికుమార్, ఆర్థికసాయం చేశారు.ఇంకా చెప్పాలంటే మంత్రి బాలినేనికి గొట్టిపాటి రవికుమార్, మధ్య వీరు ఏ పార్టీలో ఉన్నా కూడా సంబంధాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో రవి బాలినేనికి సాయం చేశారన్న గుసగుసలు కూడా జిల్లాలో ఉన్నాయి. ఈ క్రమంలోనే గొట్టిపాటి రవికుమార్ ని పార్టీలో చేర్చుకునే విషయాన్ని జగన్ బాలినేనికే అప్పగించేశారట. గతంలోనే రవి గ్రానైట్ వ్యాపారాలపై దాడులు జరిగినప్పుడు ఆయన బాలినేని సిఫార్సులతోనే వాటికి కొద్ది రోజులు బ్రేక్ వేయించుకున్నారు. అయితే సిద్ధా రాఘవరావు పార్టీ మారిన సమయంలో రవి పార్టీ మారేందుకు ఒప్పుకోకపోవడంతో వరుసగా గొట్టిపాటి రవికుమార్,ని టార్గెట్ చేశారు. ఇప్పటికీ గొట్టిపాటి రవికుమార్ వ్యాపారాలు ఆగిపోవడంతో చాలా ఇబ్బందులు పడుతోన్న పరిస్థితి.మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు, తిరుపతి ఉప ఎన్నికల ఫలితాలతో టీడీపీ కేడర్ లో మరింతగా ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. కరోనా ఉధృతి లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పలువురు కీలక నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు వరుసపెట్టి వైసీపీలోకి జంప్ కొట్టేసేవారన్న ప్రచారం జరిగింది. ఈ లిస్టులో గొట్టిపాటి రవికుమార్, పేరు కూడా వినిపించింది. ఇక బాలినేని మాత్రం రవి విషయంలో తన ప్రయత్నాలకు బ్రేక్ వేయకుండా కంటిన్యూ చేస్తున్నారట. రవి సైతం అటు టీడీపీలో ఉండలేక? ఇన్నిసార్లు గెలిచినా రాజకీయ భవిష్యత్తుపై భరోసా లేక పార్టీ మారే విషయంలో డైలమాలోనే ఉన్నారని తెలుస్తోంది.

# కౌతాళం లో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

## డిఎల్పీఓ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు నిరసన

కౌతాళం ఆదోనికి వెళ్లినా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తం రెడ్డి మరియు జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ మరియు రెండు వందల మంది బీజేపీ కార్యకర్తలతో ఆదోని డివిజనల్ పంచాయితీ అధికారి నూర్జహాన్ కు ఈ అక్రమ కట్టడాన్ని గురించి తెలియజేయడం జరిగిందని పురుషోత్తమ రెడ్డి అన్నారు డీఎల్పీవో కూడా స్పందించి వైసిపి వార్డ్ మెంబర్ అయినటువంటి మహానంది రోడ్డును ఆక్రమించి కట్టిన ఇంటిపై స్పెషల్ ఎంక్వయిరీ చేయిస్తానని ఈ అక్రమ కట్టడాన్నికి ఎవరైతే అధికారులు సహకరించారు వారందరినీ పై చర్యలు తీసుకుంటామని అక్కడ ఉన్న బాధ్యత కుటుంబాలకు న్యాయం చేస్తామని డివిజనల్ పంచాయతీ అధికారి అయినట్టు వంటి నూర్జహాన్ కూడా అన్నారు అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తంరెడ్డి మరియు జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ తెలియజేశారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఒక వైసిపి వార్డ్ మెంబర్ పంచాయితీ అప్రూవల్ లేకుండా అక్రమంగా రోడ్డును ఆక్రమించి ఇల్లు కట్టడం ఇది చాలా దారుణమని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోజురోజుకు అక్రమాలు పెరిగిపోతున్నాయని ఆయన అన్నారు.ఈ నిర్మాణాన్ని కూల్చి ఇంతవరకు వదిలిపెట్టే ప్రసక్తిలేదని ఆయన అన్నారు ఎందుకంటే ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కలిగించే ఈ అక్రమ కట్టడాన్ని గురించి అధికారులు తొందరగా చర్యలు తీసుకోవాలని లేని యెడల అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టిన మహానంది పై మరియు దీనికి సహకరించిన అధికారులకు పై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని అదేవిధంగా విరి గురించి హైకోర్టులో కేసు ఫైల్ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ మరియు రామ చంద్ర,జిల్లా యువమోర్చా కార్యదర్శి రామాంజనేయులు,మారుతి చిరుతపల్లి ఈరన్న మరియు కామావరం వెంకట్రెడ్డి రెండు వందల మంది బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హానీ ట్రాప్ లో చోక్సి

న్యూఢిల్లీ, జూన్ 2, (న్యూస్ పల్స్)పీఎన్‌బీ కుంభకోణంలో కీలక నిందితుడు, వజ్రాల వ్యాపారి మెహుల్ ఛోక్సీ మిస్సింగ్, అరెస్టు వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఆయనను కిడ్నాప్ చేసినట్టు ఛోక్సీ తరఫు న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. అయితే, చోక్సీ తన గర్ల్ ఫ్రెండ్‌తో డిన్నర్ కోసం వెళ్లి పోలీసులకు చిక్కినట్టు ఆంటిగ్వా ప్రధాని వెల్లడించారు. కానీ, ఆమె చోక్సీ గర్ల్ ఫ్రెండ్ కాదని, కిడ్నాప్ ముఠాలో ఓ పాత్రధారని సన్నిహిత వర్గాలు చెప్పినట్లు ఓ జాతీయ మీడియా కథనం వెలువరించింది.గర్ల్‌ఫ్రెండ్‌తో గడిపేందుకు చోక్సీ డోమినికా వెళ్లాడని ఆంటిగ్వా ప్రధాని గాస్టన్ బ్రౌన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బార్బరా జరబికా అనే యువతి ఫోటోలను విడుదల చేసిన అంటిగ్వా మీడియా.. ఆమె విద్యార్హతలు సహా వివరాలను వెల్లడించింది. అయితే, ఆ యువతి చోక్సీ స్నేహితురాలు కాదని చోక్సీ తరఫున లాయర్ విజయ్ అగర్వాల్ ఆరోపించారు.ఆమె చోక్సీ గర్ల్ ఫ్రెండ్ కాదని, కిడ్నాప్ ముఠాలో ఓ సూత్రధారని పేర్కొన్నారు. వాకింగ్‌కు వెళ్లిన సమయంలో ఛోక్సీతో పరిచయం పెంచుకుని చోక్సీని హానీట్రాప్‌లోకి లాగిందని అన్నారు. మే 23న ఛోక్సీకి ఫోన్ చేసి తన అపార్ట్‌మెంట్‌కు ఆహ్వానించి, ఆయన అక్కడకు వెళ్లేసరికి కిడ్నాప్ చేయించిందన్నారు.మెహుల్ చోక్సీని ఓ యువతి హానీట్రాప్ చేసింది.. ఆమె కిడ్నాప్ గ్యాంగ్‌లో ఓ సభ్యురాలు.. చోక్సీ నివాసానికి సమీపంలోనే ఆ మహిళ ఉండేదు.. ఈవెనింగ్ వాక్‌లో పరిచయం పెంచుకుని కుటుంబంతో స్నేహం నటించింది.. తర్వాత వేరే ప్రాంతానికి మకాం మార్చి.. చోక్సిని అక్కడకు ఆహ్వానించింది.. ఆమె పిలుపుతో అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన చోక్సీని పలువురు బలవంగా ఎత్తుకెళ్లి బోటులో డొమినాకాకు తరలించారు.. ఆయన తన పాస్‌పోర్ట్ కూడా తీసుకోలేదు.. ఆ యువతి తర్వాత అదృశ్యమైంది” అని లాయర్ అన్నారు.ఇది జరిగిన రెండు రోజుల తర్వాత డొమినికా బీచ్‌లో ఛోక్సీని అరెస్టు చేసినట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. మరోవైపు, డొమినికా జైల్లో ఉన్న ఛోక్సీ ఫొటోలను ఆంటిగ్వా న్యూస్ రూం ఆదివారం విడుదల చేసింది. అందులో ఆయన చేతులు, ఆయన న్యాయవాదులు ఆరోపించారు. దీనిపై వారు కోర్టుకు వెళ్లడంతో ఛోక్సీని ఆసుపత్రికి తరలించాలని అక్కడి కోర్టు ఆదేశించింది.దీంతో ఆయనను .. నెగెటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఛోక్సీని భారత్‌కు రప్పించేందుకు దర్యాప్తు సంస్థలు చర్యలు ముమ్మరం చేశాయి. శనివారం ఉదయం ఖతార్ ఎయిర్‌వేస్‌కు చెందిన ఓ విమానం ఢిల్లీ నుంచి డొమినికాకు వెళ్లింది. ఛోక్సీ అప్పగింతకు అవసరమైన పత్రాలు ఆ విమానంలో వచ్చాయని ఆంటిగ్వా ప్రధాని తెలిపారు.అయితే ఛోక్సీ కేసుపై డొమినికా కోర్టు విచారణ జరపనుంది. ఆయనను నేరుగా భారత్‌కు పంపాలా లేదా ఆంటిగ్వా పంపాలా అన్నదానిపై కోర్టు ఓ నిర్ణయం తీసుకోనుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ. 13వేల కోట్లు ఎగవేసిన కేసులో ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ నిందితులుగా ఉన్నారు.

# అమాత్య యావలో 40 మంది..

విజయవాడ, జూన్ 2, (న్యూస్ పల్స్)వైసీపీలో జగన్‌ను పక్కన పెడితే.. 150 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో 24 మంది మంత్రులు ఉన్నారు. మిగిలిన వారు 126 మంది. అయితే.. వీరిలో సగం మంది ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదు. ఒకరిని ఒకరు పలకరించుకోవడం లేదు. ఎవరికివారుగా ఉంటున్నారు. ఎవరి హడావుడిలో వారు ఉన్నారు. ఎవరైనా ఎమ్మెల్యే ఫోన్ చేసినా.. అన్నా తర్వాత చేస్తా.. అని ఫోన్ కూడా పెట్టేస్తున్నారట. ఈ విషయం ఇప్పుడు వైసీపీ వర్గాల్లోనే హాట్ టాపిక్‌గా మారింది. ఎవ్వరూ ఎందుకో అంత సంతోషంగా అయితే ఉన్నట్టే లేరన్న టాకే ఉంది. మరి దీనికి కారణం ఏంటి? ఎందుకు ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు గుస్సాగా ఉన్నారు ? అంటే.. 126 మందిలో ఏకంగా 40 మంది కీలక ఎమ్మెల్యేలు.. మంత్రి పదవులపై కన్నేశారు.వీరిలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విజయనగరం, విశాఖ, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరంతా కూడా మంత్రి పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 2019లో జగన్ తన కేబినెట్‌ను ఏర్పాటు చేసుకునే సమయంలోనే రెండున్నరేళ్ల తర్వాత.. తన కేబినెట్లో 90 శాతం మందిని మారుస్తామని చెప్పారు. ఈ క్రమంలో ఆ రెండున్నరేళ్ల కాలం కళ్లముందు గిర్రున తిరిగిపోతోంది. ఇప్పటికే రెండేళ్లు పూర్తయ్యాయి. మరో ఆరు మాసాల వ్యవధి మాత్రమే ఉంది. ఈ క్రమంలో తమకు అవకాశం దక్కించుకోవాలంటే.. తమకు అవకాశం దక్కించుకోవాలని వైసీ?పీ ఎమ్మెల్యేలు తమ ప్రయత్నాలుతాము చేస్తున్నారు.అయితే.. ఇలా మంత్రి పదవుల రేసులో ఉన్న ఎమ్మెల్యేలు.. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదు. కనీసం ఫోన్ చేసి పలకరించుకోవడం లేదు. ఫోన్ చేసి మాట్లాడితే.. మాటల మధ్య తమ వ్యవహారం ఏమైనా లీకవుతుందేమో.. తాము చేసుకుంటున్న ప్రయత్నాలను తోటి ఎమ్మెల్యే పసిగడతారేమో.. అని జంకుతున్నారట. దీంతో ఎమ్మెల్యేల మధ్య కొన్నాళ్లుగా మాటలు లేకుండాపోయాయి. ఒకే జిల్లా నుంచి మంత్రి పదవి రేసులో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు ఉప్పు నిప్పుగా వ్యవహరిస్తోన్న పరిస్థితి.ఎమ్మెల్యేల వ్యవహారం ఇలా ఉంటే.. ప్రజలను పట్టించుకునేందుకు కూడా వైసీపీ ఎమ్మెల్యేలు సహకరించడం లేదు. కరోనా సమయంలో తమకు అండగా లేకుండా పోయారంటూ.. ప్రజలు సదరు ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి మంత్రి పదవుల యావలో పడి.. ప్రజలకు దూరమైతే.. కష్టమే అంటున్నారు పరిశీలకులు. ఏదేమైనా కరోనా కష్టకాలంలో కష్టపడుతోన్న వైసీపీ ఎమ్మెల్యేల సంఖ్య డబుల్ డిజిట్ కూడా లేదంటే ఆశ్చర్యపోవాల్సిందే

# కర్నూలులో కొనసాగుతున్న సైలెంట్

కర్నూలు, జూన్ 2, (న్యూస్ పల్స్)ఏపీలో రాజకీయంగా ప్రాధాన్యం ఉన్న కర్నూలు జిల్లాలో అధికార పార్టీ వైసీపీ నేతలు, ప్రధాన ప్రతిపక్షం టీడీపీ నేతలు ఎవరికి వారుగా రాజకీయాలు చేసుకుంటున్నారు. ఇందులో కొత్త ఏముంది ? ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటేనో.. లేక మరేదైనా వివాదం చేసుకుంటేనో.. కదా రాజకీయంగా హైలెట్ అయ్యేది అనుకుంటున్నారా ? ఇక్కడే ఉంది.. కీలక విషయం. ఎవరికి వారు సైలెంట్‌గానే ఉండడం వెనుక కూడా రాజకీయం ఉందని చెబుతున్నారు పరిశీలకులు. ఇరు పార్టీల్లోనూ ఒక విధమైన స్తబ్ధత కొనసాగుతోందని చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం.. రెండు పార్టీల అధిష్టానాలేనని అంటున్నారు.టీడీపీ విషయాన్ని తీసుకుంటే.. పార్టీ తరఫున ఇక్కడ కీలక నేతలు ఉన్నప్పటికీ.. ఎవరినీ.. పార్టీ అధినేత చంద్రబాబు పట్టించు కోవడం లేదు. కర్నూలు నగర పార్టీ ఇంచార్జ్ అధికార పార్టీ నేతలతో కలిసిపోతున్నారనే వాదన కొన్నాళ్లుగా వినిపిస్తోంది. ఇక్కడ తండ్రి, కుమారుడు చెరో పార్టీలో ఉన్నా కూడా పార్టీ ఇన్‌చార్జ్ భరత్‌ను పల్లెత్తు మాట అనే పరిస్థితి లేదు. దీంతో స్థానికంగా నేతలు.. ఈ వైఖరిని వ్యతిరేకిస్తున్నారు. ఇక, మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ విషయం తీసుకున్నా.. ఆమె దూకుడు ఒకప్పుడు ఎక్కువగా ఉండేది. అయితే.. తెలంగాణలో చోటు చేసుకున్న అపహరణ కేసులో అరెస్టు కావడంతో కొంత వరకు సైలెంట్ అయ్యారు. కానీ, తర్వాత.. మళ్లీ పుంజుకున్నా చంద్రబాబు, పార్టీ అధిష్టానం కష్టకాలంలో తనను పట్టించుకోలేదన్న ఆవేదనలో ఆమెలో బాగా ఉందటనంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పార్టీలో ఉన్నట్టా ? లేనట్టా ? అని టీడీపీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. రెండు రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు అయిన నందికొట్కూరు, కోడుమూరులో పార్టీ నేతలు అసలు ఉన్నారా ? అన్న సందేహాలు ఉన్నాయి. కేఈ శ్యాంబాబు కూడా ఎక్కువగా హైదరాబాద్‌లోనే ఉంటూ పార్టీని నడిపిస్తోన్న పరిస్థితి. ఉన్నంతలో మాజీ ఎమ్మెల్యే జనార్ధన్ రెడ్డి కాస్త యాక్టివ్‌గా ఉంటున్నారు. కోట్ల ఫ్యామిలీ కాలం కలిసి రాదా ? అని వెయిటింగ్‌లో ఉంది. దాదాపు 10 నియోజకవర్గాల్లో పార్టీ పడకేసింది.ఇక, వైసీపీని తీసుకుంటే.. ఈ పార్టీలోనూ పరిస్థితి ఇబ్బందిగానే ఉంది. ఎవరికివారే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఆధిపత్య ధోరణులు పార్టీని మరింతగాఇబ్బంది పెడుతున్నాయి. ఎక్కడా సఖ్యత లేదు.. ఎవరూ కలిసి రావడం లేదనే వాదన కూడా వినిపిస్తోంది. జిల్లాలో అందరూ పార్టీ నేతలు కావడంతో బండి ఓవర్ లోడ్ అయ్యింది. ఇక మంత్రులు, కీలక నేతల మధ్య పైకి కనిపించని గ్యాప్ ఉంది. వాస్తవం ఎలా ఉన్నా జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులకు అధిష్టానంతో గ్యాప్ పెరిగిందనే అంటున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేల పాత్ర పూర్తిగా నామమాత్రం. ఏదేమైనా కీలక జిల్లాలో వైసీపీ, టీడీపీ ల్లోనూ స్తబ్దత నెలకొంది.

# నేతలు కావాలి....

విజయవాడ, జూన్ 2, (న్యూస్ పల్స్)కృష్ణా జిల్లాలో కీలకమైన నియోజకవర్గం నూజివీడులో ప్రధాన ప్రతిపక్షం దీనావస్థలో ఉంది. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పోల్చుకుంటే.. ఇక్కడ ప్రతిపక్ష నేతలు నిద్రపోతున్నారనే టాక్ వినిపిస్తోంది. టీడీపీకి ఒకప్పుడు కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో గత రెండు దశాబ్దాలుగా పార్టీకి సరైన నాథుడే లేకుండా పోయాడు. అప్పుడెప్పుడో సీనియర్ నేత కోటగిరి హనుమంతరావు వరుస విజయాలు సాధించడం మినహా తర్వాత నూజివీడులో టీడీపీని ఇక్కడ ముందుండి నడిపించే నేత పార్టీకి దొరకని పరిస్థితి. 2009లో ప్రజారాజ్యం వలస నేత చిన్నం రామకోటయ్య పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన వల్ల పార్టీకి ఎలాంటి ఉపయోగం లేదు సరికదా ? 2014 ఎన్నికల నాటికే ఆయన పార్టీ మారిపోయారు.ఇక్కడ టీడీపీ వరుసగా రెండు సార్లు ఓటమి పాలైంది. మరోవైపు కాంగ్రెస్ తరఫున గెలిచిన మేకా ప్రతాప్ అప్పారావు.. వైసీపీలోకి చేరి .. 2014, 2019 ఎన్నికల్లో వరుస విజయాలు దక్కించుకున్నారు. ఇక, ఈ రెండు ఎన్నికల్లోనూ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు టీడీపీ తరఫున పోటీ చేసినప్పటికీ.. గట్టిపోటీ ఇచ్చినా.. గెలుపు గుర్రం ఎక్కలేక పోయారు. ఇక, ఇప్పుడు పరిస్థితి చూస్తే.. ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు.. అనారోగ్యం కారణంగా అంత యాక్టివ్‌గా ఉండడం లేదు. కుల సమీకరణల్లో మంత్రి పదవి వస్తుందన్న ఆశల పల్లకీలో ఉండడం మినహా ఆయన చేసేదేం లేదు.ఈ సమయంలో టీడీపీ పుంజుకునేందుకు అవకాశం ఉంటుంది.

# పాజిటివ్ పాలిటిక్స్ పై టీడీపీలో చర్చ

తిరుపతి, జూన్ 2, (న్యూస్ పల్స్)టీడీపీలో తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలో పరాజయం అంశం కాకరేపుతోంది. పైకి మాత్రం అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వంటి సీనియర్లు గుంభనంగా ఉంటూనే వైసీపీపై విమర్శలు ఎక్కుపెట్టినా.. లోలోన మాత్రం అంతర్మథనం చెందుతున్నారు. ప్రధానంగా గడిచిన స్థానిక, కార్పొరేషన్ ఎన్నికల తర్వాత.. ఇప్పుడు తిరుపతి ఉప ఎన్నికలో అయినా.. పార్టీ పుంజు కుంటుందని అనుకున్నారు. అయితే.. అనూహ్యంగా పార్టీ పరాజయంతో పాటు ఓటు బ్యాంకు కూడా భారీగా తగ్గిపోయింది.దీంతో అసలు రీజన్ ఏంటి? అనేదానిపై లోతుగా దృష్టి పెట్టారు. ఈ క్రమంలో ఒక కీలక విషయం తెరమీదికి వచ్చినట్టు తెలుస్తోంది. ప్రధానంగా ఏ ఎన్నిక చూసుకున్నా.. జగన్‌ను టార్గెట్ చేయడం.. జగన్‌పై దుమ్మెత్తిపోయడం.. జగన్ జైలు పక్షి అని.. నేరస్తుడని.. తుగ్లక్ అని.. విమర్శలు చేయడం అనేది.. ప్రజల్లోకి వెళ్లలేదని.. వెళ్లినా.. వాళ్లు జీర్ణించుకోలేక పోతున్నారని.. పైగా మేధావి వర్గం కూడా జగన్‌ను టార్గెట్ చేసే విధానం ఇది కాదని.. కూడా అంటున్న విషయాన్ని సీనియర్లు ప్రస్తుతం ఫోన్లలో చర్చించుకుంటున్నారని తెలుస్తోంది.“అతిగా టార్గెట్ చేయడం కూడా తప్పే. పైగా 2019లో వేసిన రికార్డే.. మళ్లీ తిరుపతిలోనూ ప్లే చేశారు. ఇదే రివర్స్ అయి ఉంటుంది“ అని చర్చించుకుంటుండడం గమనార్హం. ప్రస్తుతం ఎంత లేదన్నా.. కాదన్నా.. జగన్‌పై ప్రజల్లో కొంత మేరకు సింపతీ ఉంది. గతంలో ఎన్నడూ ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక లబ్ధి జనాలకు చేకూరలేదు. ఈ క్రమంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. ప్రజలకు జగన్ ఆర్థికంగా వివిధ పథకాల రూపంలో ఆదుకుంటున్నారు. సో.. ఈ క్రమంలో జగన్‌పై విమర్శలను లేదా .. ఆయనను దిగజార్చే విధంగా చేసే వ్యాఖ్యలను వారు సహించలేక పోతున్నారనే వాదన కూడా ఉంది.పైగా.. టీడీపీపై ఇలాంటి విమర్శలు.. వైసీపీ నుంచి ఎక్కడా వినిపించడం లేదు. వారి పథకాలను చూసి ప్రజలు ఓటేయాలని మాత్రమే వైసీపీ నేతలు కోరుతున్నారు. కానీ, టీడీపీ మాత్రం.. విమర్శలతోను.. ఎదురుదాడితోనూ సరిపుచ్చుతోంది. ఇదే.. టీడీపీ సంస్థాగత ఓటు బ్యాంకు కదిలిపోతుండడం కూడా రీజన్ అని అంటున్నారు పరిశీలకులు. మరి దీనిపై దృష్టి పెట్టాల్సిన.. చంద్రబాబు ఆయన పరివారం.. మాత్రం కర్ర విడిచి సాము చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు.

# రైతులకు కావలసిన అన్ని రకాల సేవలు రైతు భరోసా కేంద్రాలోనే

మంత్రాలయం రైతులకు కావాల్సిన అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాల్లోనే లభిస్తాయని ఏఈఓ.నరసింహుడు తెలిపారు. మండల పరిదిలోని లోని కల్లుదేవాకుంట రైతుభరోసాకేంద్రము నందు ఈ ఖరీఫ్ సీజన్ కు సంబందించి రైతులతో సమావేశం కావడం జరిగింది ఇందులో రైతులకు సలహాలు సుంచనలు తెలియజేసారు. ఈ సమావేశం అనంతరం కల్లుదేవకుంట రైతుభరోసా కేంద్రానికి 10మెట్రిక్ టన్నులు యూరియా 10 మెట్రిక్ టన్నులు 28:28:00 కాంప్లెక్స్ ఎరువులు రావడం జరిగిందిఈ ఎరువులు లను మన కల్లుదేవకుంట గ్రామ సర్పచ్ కే. రవీంద్ర రెడ్డి, యూరియా మరియు 28:28:00. కాంప్లెక్స్ 15 మంది రైతులకు 89 బస్తాలు ఎరువులు పంపిణి చేసారు. ఒక యూరియా బస్తా ధర 267 రూపాయలు మరియు 28:28:00 కాంప్లెక్స్ ఒక బస్తా ధర 1475 చొప్పున రైతులకు పంపిణి చేయడం జరిగిందిఈ కార్యక్రమం లో గ్రామ ఉప సర్పంచ్ బోయ సంజీవప్ప, గ్రామ వాలీంటిరీలు మల్లికార్జున, వెంకటేష్, వినోదు. భాస్కర్, బోయ వెంకటేష్ మరియు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ లక్ష్మిరెడ్డి మరియు వాల్మీకి విష్ణు, రాఘవేంద్ర,పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను నెరవేర్చండి

**పెన్ జాప్ స్టేట్ సెక్రటరీ చంద్రశేఖరరెడ్డి**

కర్నూలు జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని పెన్ జాప్ జర్నలిస్టు అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ చంద్రశేఖరరెడ్డి కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్స్ జారీ చెయ్యాలి. చిన్న పత్రికలు, పీరియాడికల్స్ ఎడిటర్స్, రిపోర్టర్లకు వన్ థర్డ్ బస్ పాస్ తో కూడిన స్టేట్ అక్రిడిటేషన్ ఇవ్వాలి. చిన్న పత్రికలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని. చిన్న పత్రికలు, పీరియాడికల్స్ కు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలి. అక్రిడిటేషన్ తో నిమిత్తం లేకుండా వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇల్లు, మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని తెలిపారు. జర్నలిస్టుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని, జర్నలిస్ట్ మరణిస్తే అతని కుటుంబానికి 10 లక్షల రూపాయలతో పాటు నెలకు ఐదు వేల రూపాయల చొప్పున ఐదేళ్ల పాటు ఇచ్చి ఆదుకోవాలన్నారు. 55 ఏళ్లు వయసు దాటిన సీనియర్ జర్నలిస్టులకు నెలకు ఐదు వేల రూపాయల చొప్పున ఫించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు, అర్చకులు, ఫాస్టర్లు, ఇమామ్ లకు ప్రభుత్వం చెల్లిస్తున్న మాదిరిగా వర్కింగ్ జర్నలిస్టులందరికీ నెలకు10 వేలు, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న రిపోర్టర్లకు నెలకు 15 వేల రూపాయలు చొప్పున కనీస వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న రిపోర్టర్లు, ఫోటో, వీడియో జర్నలిస్టులకు వేజ్ బోర్డు అమలు జరిపేలా చర్యలు చేపట్టాలి.

# ప్రశాంత్ కథ ప్రశాంతం

విశాఖపట్నం ప్రేమించిన యువతి కోసం సరిహద్దు దాటి పాకిస్తాన్ బోర్డర్లో 2019 లో చిక్కుకున్న ప్రశాంత్ కథ మొత్తానికి ప్రశాంతంగా ముగిసింది.పోలీసుల చొరవతో క్షేమంగా ఇంటికి తిరిగిరావడంతో ప్రశాంత్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తనను వెనక్కు రప్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేశాయని ప్రశాంత్ అన్నారు.అధికారులు, నిరంతరం పాక్తో సంప్రదింపులు జరిపారని తెలిపారు.

# అయోమయంలో విష్ణుకుమార్ రాజు...

విశాఖపట్టణం, జూన్ 2, (న్యూస్ పల్స్)అదేంటో జగన్ కి రాజుల నుంచే కొంత ఇబ్బంది వస్తోంది. సొంత పార్టీ ఎంపీ రఘురామ కృష్ణం రాజు చెవిలో జోరిగ మాదిరిగా మారి చేయాల్సిన డ్యామేజిని అటు పార్టీకి ఇటు ప్రభుత్వానికి చేసేస్తున్నారు. ఆయన విషయం అలా ఉంటే ఇపుడు విశాఖకు చెందిన బీజేపీ నేత విష్ణు కుమార్ రాజు కూడా జగన్ మీద ఘాటుగానే విమర్శలు చేస్తున్నారు. జగన్ ని ఒక నియంత అంటూ నిందిస్తున్నారు. ఆయనను వింత ముఖ్యమంత్రి అని కూడా కొత్త పేరు పెట్టేశారు. ఏపీలో జగన్ అనుకున్నదే జరగాలా అంటూ నిలదీస్తున్నారు.2014 ఎన్నికల తరువాత ఏపీకి జగన్ విపక్ష నేతగా ఉన్నపుడు బీజేపీ తరఫున శాసన సభా పక్ష నేతగా విష్ణు కుమార్ రాజు ఉండేవారు. అప్పట్లో సభలో విపక్షాలను కోఆర్డినేట్ చేసుకునే ప్రాసెస్ లో జగన్ కి ఆయన సన్నిహితం అయ్యారు. రాజు అటు చంద్రబాబుకూ ఇటు జగన్ కి కూడా చెడ్డకాకుండా మంచి మిత్రుడిగా మధ్యవర్తిగా వ్యవహరించేవారు. అలాంటి చనువు పెంచుకున్న విష్ణు కుమార్ రాజుకు అటు వైసీపీలో కానీ ఇటు టీడీపీలో కానీ సీటు ఖాయమని అంతా అనుకున్నారు. దానికి తగినట్లుగా రాజు కూడా రెండు పార్టీలను పొగుడుతూ వచ్చారు. గత ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నం చేశారని అయినా రాలేదనీ చెబుతారు.జగన్ సీఎం అయిన కొత్తలో ఆయన పాలనను విష్ణు కుమార్ రాజు బాగా మెచ్చుకునేవారు. ఇంగ్లీష్ మీడియం విద్యా బోధన మీద ఆయన గట్టి మద్దతు ఇచ్చారు. పార్టీ స్టాండ్ కి భిన్నంగా కూడా చాలా సార్లు జగన్ని పొగిడేవారు. ఈ చనువుతో ఆయన జగన్ని వ్యక్తిగతంగా కలవాలని చాలా సార్లు ట్రై చేశారుట. ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ మాత్రం ఆయనకు దొరకలేదుట. మరి పొరపాటు ఎక్కడ జరిగిందో కానీ జగన్ ని నేరుగా కలసి ప్రజా సమస్యలు ప్రస్థావనకు తెద్దామని చూసిన విష్ణు కుమార్ రాజుకు నో అపాయింట్మెంట్ అని జగన్ పేషీ నుంచి ఆన్సర్ వచ్చిందట. దాంతో మండుకుపోయిన రాజు జగన్ మీద విమర్శలకు తెర తీశారు అంటారు. ఒక మాజీ ఎమ్మెల్యేగా, మాజీ ఫ్లోర్ లీడర్ గా జగన్ని కలుద్దామనుకుంటే తనకే అవకాశం లేదని చెబుతూ ఈ రోజుకూ విష్ణు కుమార్ రాజు హర్ట్ అవుతూనే ఉన్నారు.ఇదే నేపథ్యంలో ఏపీలో రాజకీయ పరిణామాలు కూడా వేగంగా మారిపోయాయి. యాంటీ జగన్ స్టాండ్ తో బలపడాలని బీజేపీ చూడడంతో పాటు వైసీపీ సర్కార్ మీద గట్టిగా విరుచుకుపడాల్సిందే అంటూ ఆదేశాలు జారీ చేయడంతో దాన్ని అందిపుచ్చుకుని జగన్ మీద ఒంటి కాలు మీదే విష్ణు కుమార్ రాజు చెలరేగుతున్నారు. జగన్ ఏలుబడిలో వ్యవస్థలు అన్నీ కూడా కుప్ప కూలాయి అంటున్నారు. ఏపీలో ప్రజా ప్రతినిధులకే న్యాయం జరగకపోతే సామాన్యుల సంగతేంటి అంటూ కూడా విష్ణు కుమార్ రాజు ప్రశ్నిస్తున్నారు. జగన్ ది వింత విచిత్ర ప్రభుత్వమని, విపక్షాల గొంతు నొక్కే సర్కార్ అంటూ రాజు గారు ఫైర్ అవుతున్నారు. మరి బీజేపీ నేత సోము వీర్రాజుకు జగన్ అపాయింట్మెంట్ ఇచ్చారు. సీపీఎం నేతకూ ఇచ్చారు. విష్ణు కుమార్ రాజుకి కూడా అలాగే అపాయింట్మెంట్ ఇచ్చి ఉంటే ఆయన రాజకీయ విమర్శల సంగతి పక్కన పెడితే ఇలా హర్ట్ అయిన బాధ నుంచి కాస్తా రిలీఫ్ లభిస్తుంది

# గ్రామాల్లో జోరుగా బెల్టుషాపుల దోపిడీలు

**ఊరూర 10 నుండి 20 బెల్టుషాపులు**

**ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మకాలు**

**మద్యం దుకాణాల్లో పనిచేసే వారే ప్రధాన సూత్రధారులు**

నెల్లూరు నెల్లూరు జిల్లా ,గూడూరు నియోజకవర్గ పరిధిలోని కోట, తిన్నెల పూడి,లక్ష్మమ్మ కండ్రిగ,తిమ్మానాయుడు పాళెం ,ఇతరత్రా గ్రామాల్లో మద్యం వ్యాపారం బెల్టు షాపుల ద్వారా ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. కిరాణ షాపుల్లోనే నిత్యవసర సరుకుల మాదిరిగా మద్యం అమ్మకాలను సాగిస్తున్నారు. అధికారులు మాత్రం బెల్టుషాపుల నిర్వహణపై ఉక్కుపాదం మోపుతాయని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఒక్కో గ్రామంలో 10 నుంచి 20 వరకు మద్యం బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. ఈ విషయం స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో( ఎస్ ఈ బి) అబ్కారీ శాఖ అధికారులు ,పోలీస్ శాఖ అధికారులకు తెలిసినా పట్టనట్లు ఉంటున్నారు. నామమాత్రంగా అప్పుడప్పుడు దాడులు నిర్వహించి, చేతులు దులుపుకుంటున్నారు. మద్యం షాపుల్లో ఎమ్మార్పీ రేటుకు మద్యం అమ్ముతున్నప్పటికీ, బెల్టు షాపుల్లో మాత్రం రేట్లను 10 నుంచి 20 శాతం పెంచి విక్రయాలు జరుపుతున్నారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో 5 మండలాల్లో మద్యం షాపులు కొనసాగుతున్నాయి.ఒక కోట మండలం లో 21 పంచాయితీలు, 40 రెవెన్యూ గ్రామాల్లో దాదాపుగా 200 కిపైగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే పోలీసులు గతంలో ఏ మండలంలో ఎంత మంది బెల్టు షాపులు నిర్వహిస్తున్నారో గుర్తించి బైండోవర్ చేశారు. ప్రతి మండలానికి 25 నుంచి 35 మంది చొప్పున బైండోవర్ చేశారు. ఆ తర్వాత మద్యం బెల్టు షాపుల విషయాన్ని మరిచిపోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే గ్రామాల్లో మద్యం ధరలను మాత్రం ఇష్టారాజ్యంగా పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో మద్యం ప్రియులు తప్పని పరిస్థితుల్లో ధర ఎంతైనా కొనుగోలు చేసుకొని సేవించాల్సిన దుస్థితి నెలకొంది.అసలే పెరిగిన రేట్లతో మద్యం ప్రియులు ఆందోళన చెందుతుంటే బెల్టు షాపుల్లో రేట్లు పెంచడంతో తప్పని పరిస్థితుల్లో కొనాల్సి వస్తోందనిపలువురు వాపోతున్నారు.కాగా డిమాండ్‌ను బట్టి మద్యం వ్యాపారులు మద్యం ప్రియులను నిలువునా దోపిడీ చేస్తున్నారు.ఊరూరా బెల్టుషాపులు.. రోజుకు వేలల్లో సంపాదనవైన్ షాపుల్లో పనిచేసే వారి చేతి వాటం తో గ్రామాలకు మద్యం చేరి బెల్టుషాపులు రూపంలో ఊరూరా సరఫరా అవుతున్నాయి. మద్యం దుకాణాల్లో పనిచేసే వారు ఒక్కొక్క వ్యక్తికి ఇవ్వాల్సిన మందు కంటే 10 ఇంతలు మద్యం సీసాలు ఇవ్వడంతో చేస్తున్నారు. బెల్టుషాపులు నిర్వహుకులు మద్యాన్ని ఊరూరా సరఫరా చేసి లాభాలు గడించేందుకు యత్నిస్తున్నారు. కోట పట్టణంలోని శ్యామ సుందర పురం,హరిజన వాడ, బజారు, ఆకుతోట, నార్త్ గిరిజన కాలనీ, తిన్నెల పూడి, లక్ష్మమ్మ కండ్రిగ,తిమ్మానాయుడు పాళెం, తదితర గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా నిత్యం అమ్ముతున్నారు. కేవలం ఒక షాపు ద్వారానే 1000 నుంచి 5 వేల రూపాయలు ఆదాయం గడియిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న షాపుల యజమానులు ఒక్కో బీరు, విస్కీ క్వార్టర్ సీసా మీద రూ. 50 నుంచి రూ.80ల వరకు అధికంగా విక్రయిస్తున్నారు. వ్యాపారులు కిరాణ షాపుల్లో చిల్లర వస్తువుల్లా అమ్మకాలు జరుతున్నారు.గ్రామాల్లో మందుబాబుల గొడవలు. గ్రామాల్లో విరివిగా బెల్టుషాపులు ఉండడంతో గొడవలు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కోట గ్రామంలోని బెల్టుషాపు దగ్గర గొడవను ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. షాపులు అందుబాటులో ఉండడంతో మద్యం ప్రియులకు తాగడానికి దూరం వెళ్లాల్సిన అవసరం లేకపోయింది. దీంతో షాపుల్లో ఖాతాలు పెట్టి మరీ తాగుడుకు బానిస అవుతున్నారు. బెల్టుషాపులు నిర్వహు కులు జాబితా అధికారులు చెంత.గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహుకులు జాబితా అబ్కారీ అధికారులు చెంత ఉన్నాయి.కానీ వారు ఉదర స్వభావం తో బెల్టుషాపులు గ్రామాల్లో జోరు అందుకుంటున్నాయి. స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో( ఎస్ ఈ బి) అబ్కారీ శాఖ అధికారులు చిన్నపాటి కేసులు కట్టిన బెల్ట్ షాపులు నిర్వాహకులు 2రోజుల్లో బెల్ పై వచ్చి మరలా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. బెల్టుషాపులు వల్ల గ్రామాల్లో ప్రజలకు మనశాంతి లేకుండా పోతుంది.మహిళలు పరిస్థితి మరీ దారుణంగా ఉ ంది. కరోనా లాక్ డౌన్ లో 12 గంటల దాకా మద్యం దుకాణాలు ఉంటా యి.ఆ తరువాత బెల్టుషాపులు నిర్వహుకులు ఇష్ట రాజ్యం.హైటెక్ బెల్టుషా పులు.స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో( ఎస్ ఈ బి) అబ్కారీ శాఖ అధికారులు దాడులు కు దొరక్కుండా బెల్టుషాపులు నిర్వహుకులు ఒక ముఠా గా ఏర్పడి అన్నీ మండలాల్లో ఉన్న మద్యం షాపులు నుండి మద్యం లక్షల రూపాయల ల్లో కొనుగోలు చేసి వాటిని ఎవరికి కంటపడకుండా మద్యం సీసాలు రహస్య ప్రాంతాలకు తరలిస్తారు.,మద్యం షాపులను కొద్దీ దూరంలోనే బెల్టుషాపులు నిర్వహుకులు ఉంటారు, వాళ్ళు డబ్బులు తీసుకొని మందు దొరికే ప్రాంతంలో ఒక మార్క్ ప్రదేశం దగ్గర ఉండమంటారు వెంటనే మందు బాబు అక్కడికి చేరిన వెంటనేఒక బైక్ లో మందు సీసా ఇచ్చి జంప్ అవుతారు,ఇలా హైటెక్ బెల్టుషాపులు నిర్వహిస్తూ..రోజుకు లక్షల్లో సంపాదనలు జరుగుతున్నాయి.

# ప్రమాద బాధిత ఏసీ టెక్నీషియన్లకు ఆర్థిక చేయూత

నెల్లూరు నెల్లూరు జిల్లాకు చెందిన ప్రమాద బాధిత ఏసీ టెక్నీషియన్ల కుటుంబాలకు సింహపురి రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1 లక్ష 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో సింహపురి ఆర్ అండ్ ఏసీ వర్కర్స్ అసోసియేషన్ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన్నీరు గిరి మరియు షేక్ షఫీ అను ఇద్దరు ఏసీ టెక్నీషియన్ లు ఏప్రిల్ 9న వర్క్ నిమిత్తం ఎన్టీఆర్ నగర్ హైవేపై ప్రయాణిస్తుండగా రోడ్డు ప్రమాదం జరగడంతో గిరి టెక్నీషియన్ అక్కడికక్కడే మరణించగా, షేక్ షఫీ తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించాలనే సంకల్పంతో ఏపీ ఆర్, ఆర్ ఏ సి టి డబ్ల్యూ ఏ రాష్ట్ర అధ్యక్షులు అడబాల రాజు సహకారంతో, అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మసూద్ జానీ సూచనలు సలహాల మేరకు, రాష్ట్రంలోని 40 అసోసియేషన్ల సహకారంతో సహాయత నిధిని సమకూర్చడం జరిగిందని చెప్పారు. సమకూర్చబడిన 1 లక్ష 50 వేల వేలు ఆర్థిక సహాయాన్ని సింహపురి ఏసి వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు అందజేయడం సంతోషకర విషయం అన్నారు. ఇటువంటి ఇబ్బందికర పరిస్థితుల్లో ఒకరికొకరు సహాయం చేసుకోవాలనే ఆశయంతోనే అసోసియేషన్ ఏర్పాటు కావడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్. వసంత కుమార్, ఉపాధ్యక్షులు షేక్ ఐజెస్, కార్యదర్శి వై. గోపి, సంయుక్త కార్యదర్శి శరత్ బాబు, ట్రెజరర్ పి. వాసు, యూత్ రింగ్ లీడర్ పి. కపూర్ ఖాన్ మరియు అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నో వ్యాక్సిన్.... నో శాలరీ

లక్నో, జూన్ 2, (న్యూస్ పల్స్)కరోనా సెకండ్ వేవ్ తీవ్రంగా విరుచుకుపడుతోంది. దేశ వ్యాప్తంగా కోవిడ్ కేసులు, మరణాలు భారీగా పెరుగుతున్నాయి. అయితే మహమ్మారిని అరికట్టేందుకు లాక్‌డౌన్ వంటి చర్యలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే. కరోనా కట్టడికి వ్యాక్సినే ప్రధాన ఆయుధమని వైద్య నిపుణులు చూచిస్తున్నప్పటికీ వ్యాక్సిన్ తీసుకునేందుకు కొంతమంది ఆసక్తి చూపించడం లేదు. అంతేగాక వ్యాక్సిన్ వేసుకుంటే ఏమైనా ఇబ్బందులు వస్తాయోమేనని బయపడుతున్నారు.ఇలాంటి సమయంలో టీకా కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు ఉత్తర్ ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లా అధికారులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు వ్యాక్సిన్లు తీసుకునేలా చర్యలు చేపట్టారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని.. వ్యాక్సిన్ వేయించుకోని వాళ్లు నెల జీతం పొందలేరని బుధవారం ఫిరోజాబాద్ అధికారులు తెలిపారు. మేరకు జిల్లా కలెక్టర్ చంద్ర విజయ్ సింగ్..’నో వ్యాక్సిన్ నో శాలరీ’కి సంబంధించి ఆదేశాలు జారీ చేశారన్నారు. టీకాలు తీసుకున్న ఉద్యోగుల లిస్టును సిద్ధం చేయాలని.. అందరూ వ్యాక్సిన్ వేయించుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఉ ద్యోగి ఎవరైనా వ్యాక్సిన్ తీసుకోకుంటే సదరు ఉద్యోగిపై సంబంధిత శాఖ చర్యలు తీసకుంటుందని,జీతాన్ని నిలిపివేస్తుందని జిల్లా చీఫ్? డెవలప్?మెంట్ ఆఫీసర్ తెలిపారు. అయితే టీకా తీసుకోని ఉద్యోగులకు మే నెల జీతం ఆపేయనున్నట్లు ప్రకటించడంతో.. సాలరీ ఆగిపోతుందనే భయంతో ఉద్యోగులు టీకా తీసుకునేందుకు ముందుకొస్తున్నట్లు పేర్కొన్నారు.

# స్లమ్ ఫ్రీ సిటీగా విశాఖ

విశాఖపట్నం ప్రతి వార్డుల్లో వాటర్, డ్రైనేజీ , పార్కులు లాంటి సమస్యలపై 98 వార్డులకు వార్డు డెవలప్మెంట్ ప్లాన్ లు సిద్ధం చెయ్యాలని నిర్ణయం టీసుకున్నామని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ముడసరలోవ రిజర్వాయర్ ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తాము. దీని కోసం 100 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి ని కొరాము. పంచ గ్రామాల సమస్యలు కోర్టులో ఉంది..తీర్పు రాగానే సమస్య పరిష్కారం చేస్తాము. స్లమ్స్ లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు.స్లమ్స్ ఫ్రీ సిటీ గా విశాఖ ను తీర్చి దిద్దే ప్రయత్నం చేస్తున్నాము. సింహాచల దేవస్థానం కొండ దేవస్థానం ఆస్తులు చుట్టూ వాల్ నిర్మిస్తాము. మూడు రాజధానులు అంశానికి కోర్టు కేసులు సంబంధం లేదు. ముఖ్యమంత్రి ఎక్కడ నుంచి ఐనా పాలన చెయ్యొచ్చు. త్వరలో విశాఖ నుంచి పాలన సాగుతుందని అన్నారు.

# అనందయ్య మందుపై అభ్యంతరం

నెల్లూరు ఆనందయ్య సంప్రదాయ మందు కు ఎపి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పై జనవిజ్ఞాన వేదిక నేత డాక్టర్ రమణయ్య,ఎమ్మెల్సీ డాక్టర్ విఠపు బాల సుబ్రహ్మణ్యం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.. ఏ మాత్రం శాస్త్రీయత లేని నాటు మందును జనల పైకి ఎలా వదులుతారని ప్రశ్నించారు. ది. కరోనా కష్టల్లో ఎపి సర్కార్ ఫెయిల్ అయ్యింది కాబట్టే కరోనా మందంటు ఏదిచ్చినా ప్రజలు తింటున్నారు. ఏ మాత్రం శాస్త్రీయత లేని మందులను సోషల్ మీడియా,మీడియా డిమాండ్ చేసిందని అనుమతించటం అన్యాయమని వ్యాఖ్యానించారు. శాస్త్రీయంగా అసలు ఏ కోంచెం నిరూపితం కానీ నాటు మందును మీ ఇష్టం ఉంటే వాడండి అని ప్రభుత్వం చెప్పడం, వైసిపి ఎమ్మెల్యేలు, ,ఆనందయ్య ఇది కరోనా కు పని చేస్తుందని చెప్పడం నేరమని వారన్నారు.

# అనుమతులు లేని మల్టి స్పెషాలిటీ హాస్పటల్

**సీజ్ చేసిన అధికారులు**

తాడేపల్లిగూడెం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం శ్రీ స్టార్ మల్టి స్పెషాలిటీ హాస్పటల్ తనిఖీ లో బయటపడ్డ ఆశ్చర్యపోయే విషయాలు బయటపడ్డాయి. ఏ విధమైన అనుమతి పత్రాలు లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఆస్పత్రి యాజమాన్యం ఇప్పటివరకు కనీసం ప్రభుత్వ అనుమతి కోసం పత్రాలు సమర్పించలేదు. ఆరు నెలల నుండీ ఏ అనుమతులు లేకుండా కోవిడ్ రోగులకు చికిత్స అందిస్తున్నారు. కోవిడ్ రోగులకు కోవిడ్ వైద్యం చేస్తు పట్టుబడ్డ శ్రీ స్టార్ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ ను ఆకస్మిక తనిఖీ చెసిన అదనపు డీఎంహెచ్వో డా. సుచిత్ర సే సీజ్ చేసారు. గత నెల22 నుండి కోవిడ్ చికిత్సపొందుతున్న గణపవరం మండలం కొమ్మర గ్రామానికి చెందిన బుద్ధాల రామకృష్ణను తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పేషెంట్ ఒక్కొక్కరి నుండి రోజుకు 70 వేల రూపాయలు వసూలు చేశారని పేషెంట్ల బంధువులు ఆరోపిస్తున్నారు. హాస్పిటల్ యాజమాన్యానికి అధికారుల తనిఖీ కి సంబంధించి ముందే సమాచారం అందటంతో పేషెంట్లు ఇతర హాస్పిటల్ కి తరలించినట్లు సమాచారం. తాడేపల్లిగూడెంలోని కొందరు కీలక అధికారుల అండతో ఈ ఆస్పత్రి నిర్వహణ జరుగుతున్నట్లు సమాచారం.

# ప్రైవేటు ఆసుపత్రులలో తనిఖీలు

**పలు ఆసుపత్రులకు భారీ జరిమానాలు**

తిరుపతి చిత్తూరు జిల్లాలోని తిరుపతి ప్రైవేట్ ఆసుపత్రులపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝళిపించింది. కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించిన తిరుపతిలోని సంకల్ప ఆసుపత్రి, శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, పుత్తూరు సుభాషిణి ఆసుపత్రి, పీలేరు లోని ప్రసాద్ ఆసుపత్రి, మదనపల్లి లోని చంద్ర మోహన్ నర్సింగ్ హోమ్ లపై జిల్లా యంత్రాంగం 53 లక్షలకు పైగానే ఫైన్లు విధించింది. మూడు రోజుల్లో విధించిన అపరాధ రుసుం కట్టాలని నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఈ ఆసుపత్రుల యజమాన్యాలపై ఐపీసీ 188, 406, 420, 53 సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయి. డ్రగ్ ఆడిట్ లో రెమ్ డెసివర్ ఇంజక్షన్ల అక్రమ వినియోగం బయటపడింది. ఆసుపత్రుల్లో అనుమతి లేకుండా బెడ్ లు ఏర్పాటు చేసుకోవడం, ఆరోగ్యశ్రీ బాధితుల నుంచి అడ్వాన్సులు కట్టించుకుని వైద్యం చేయడం, అధిక ధరలకు సిటీ స్కాన్ లు నిర్వహించడం లాంటి అక్రమాలు జరిగాయని జిల్లా యంత్రాంగం గుర్తించింది..

# బ్రహ్మాం గారి మఠానికి పీఠాధిపతులు

కడప వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారిమఠం మండలంలోని వివాదాస్పదంగా మారిన బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి ఎంపికలో కొత్త పరిణామం చొటుచేసుకుంది. మఠం నూతన పీఠాధిపతి ఎంపిక కొసం చర్చించేందుకు 12 మంది పీఠాధిపతులు బుధవారం బ్రహ్మంగారిమఠంకు చేరుకున్నారు. బ్రహ్మంగారి వారసుల మధ్య విభేధాలు పొడచూపిన నేపథ్యంలొ చర్చలు జరిపేందుకు పీఠాధిపతులు మఠం చేరుకున్నారు. శ్రీ శైవ క్షేత్రం పీఠాధిపతులు, విశ్వధర్మ పరిరక్షణ వేదిక అధ్యక్షులు శ్రీ శివస్వామి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు పన్నెండు మంది పీఠాధిపతులు రావడం జరిగింది. మఠం చేరుకున్న శ్రీ శివస్వామి మాట్లాడుతూ... బ్రహ్మంగారి మఠం పీఠాధిపత్యం వివాద పరిష్కారం కోసం కృషి చేస్తామని, తమ రెండు రోజుల పర్యటనలొ భక్తుల మనోభావాలతో పాటు గత మఠాధిపతుల శిష్యులు, స్థానికుల తో కూడా చర్చిస్తామని తెలియజేశారు. వివాదం కొర్టుకు చేరకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రెండు రాష్ట్రాలకు చెందిన వివిధ పీఠాలకు చెందిన పీఠాధిపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జంట ఆత్మహత్య

అనంతపురం అనంతపురం జిల్లా మడకశిర మండలం హెచ్.ఆర్.పాళ్యం గ్రామం సమీపంలోని పొలంలో ఓ వివాహితుడు మరో వివాహితరాలు ఒకే చెట్టుకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ శేషగిరి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు మడకశిర పట్టణంలోని శివాపురం ఒకటో వార్డుకు చెందిన ఈశ్వరప్ప నందు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు గతంలో వీరు ప్రేమించుకున్నారు పలు కారణాలతో ఇద్దరికి ఇతరులతో వేర్వేరు వివాహాలు జరిగాయి ఈశ్వరప్ప కు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు నందుకు ఒక కుమారుడు సంతానం ఉన్నారు

# కృష్ణ పట్టణానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకు రావడం ఆనందదాయకం

## ఆనందయ్య కు జిల్లా జర్నలిస్టుల సత్కారం

నెల్లూరు ప్రపంచ పటంలో రెండవసారి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం కి గుర్తింపు తీసుకొచ్చిన ఆనందయ్య వైద్య సేవలు అభినందనీయమని జిల్లా జర్నలిస్ట్ నాయకులు ఆయన సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ఉత్కంఠ భరితమైన వివాదాస్పద పరిస్థితులను ఎదుర్కొని ఎట్టకేలకు ఆనందయ్య మందు పంపిణీ కి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఇప్పటికే నెల్లూరు జిల్లా కృష్ణపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కృష్ణపట్నం పోర్టు తో ప్రపంచంలో నెల్లూరు జిల్లాకు గుర్తింపు రావడం జరిగిందన్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో ప్రస్తుత పరిణామాల దృష్ట్యా కరోనాకు మందు పంపిణీ చేసిన కృష్ణపట్నం ఆనందయ్య వైద్య సేవలతో రెండోసారి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం కి పేరు ప్రఖ్యాతులు రావడం సంతోషకర విషయం అన్నారు. ఆనందయ్య మందుకు తగిన గుర్తింపు తో పాటు ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను కాపాడేందుకు మరింత దోహదపడాలని ఆకాంక్షించారు. కరోనా వైరస్ విస్తృతంగా పంపిస్తున్న నేపథ్యంలో కూడా జర్నలిస్టులు తమ తమ వృత్తి ధర్మంగా వార్తా సేకరణ విధులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో కరోనా వైరస్ తొలి దశలోనూ రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది జర్నలిస్టు మిత్రులను కోల్పోవడం జరిగింది అన్నారు. ప్రస్తుత రెండవ దశ లో కూడా మరి కొంతమందిని కోల్పోవాల్సి వచ్చింది అన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులందరికీ కరోనా వైరస్ నియంత్రణకు ఆనందయ్య మందు పంపిణీ చేయాలని జిల్లా జర్నలిస్ట్ నాయకులు ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ నాయకులు అరవ జయ ప్రకాష్, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశగంగ వద్ద జూన్ 4 నుంచి 8 దాకా వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

- వచ్చే ఏడాది మరింత వైభవంగా నిర్వహిస్తాం
- ఆంజనేయుని జన్మస్థలం విషయంలో వివాదమే లేదు

అదనపు ఈవో ఎవి ధర్మారెడ్డి

తిరుమల, ,జూన్ 02, తిరుమలలోని ఆకాశగంగ ప్రాంతం శ్రీ హనుమంతుని జన్మ స్థలమని టీటీడీ కమిటీ ప్రకటించిన నేపథ్యంలో ఆకాశగంగ వద్ద ఈ నెల 4 వ తేదీ నుంచి 8వ తేదీ దాకా హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని అదనపు ఈవో ఎవి ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో బుధవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. టీటీడీ పంచాంగంలో నిర్దేశించిన ప్రకారం ప్రతి ఏటా చేసే కార్యక్రమాలు యథాతథంగా చేస్తామన్నారు. ఈ సారి ఆకాశగంగలో 4వ తేదీ నుంచి 8వ తేదీ దాకా రోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 8 – 30 నుంచి 10 గంటల వరకు అంజనాదేవి, బాల హనుమంతల వారికి అభిషేకం, రోజుకొక పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు శ్రీ ధర్మారెడ్డి చెప్పారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు హనుమాన్ చాలీసా ఉంటుందన్నారు. 4వతేదీ సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు డాక్టర్ రాణి సదాశివమూర్తి చే హనుమంతుడు, అష్టసిద్ధులు అనే అంశంపై నేటి పరిస్థితులకు అనుగుణమైన విధంగా సవివర వ్యాఖ్యానం ఉంటుందని చెప్పారు. 5వతేదీ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ చే నేటి యువతకు ఆదర్శం హనుమ అనే అంశంపై వ్యాఖ్యానం ఉంటుందని చెప్పారు. 6వతేదీ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డాక్టర్ నందన్ భట్ చే హనుమంతుని వ్యక్తిత్వం పై వ్యాఖ్యానం జరుగుతుందని ఆయన తెలిపారు. 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డాక్టర్ మారుతి చే హనుమంతుని వాక్ వైభవం అంశంపై వ్యాఖ్యానం జరుగుతుందన్నారు. 8 వతేదీ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డాక్టర్ రాగి వెంకటాచారి వారిచే హనుమంతుని కార్యదక్షత అనే అంశం మీద వ్యాఖ్యానం నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అదనపు ఈవో వివరించారు. తిరుమలకు వచ్చే యాత్రికులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనడానికి అనుమతిస్తామన్నారు. వచ్చే ఏడాది మరింత వైభవంగా ఆకాశగంగ వద్ద హనుజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంజనేయ స్వామిరాక్షసుల బారి నుంచి ప్రజలను విముక్తులను చేశారని, కరోనా మహమ్మారి నుంచి ప్రజలను విముక్తులను చేయడానికి కూడా ఈ కార్యక్రమాలన్నీ ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. 12 పురాణాలు, దైవ సాక్షాత్కారం పొందిన మహా పురుషులు ఆంజనేయ స్వామి వారు ఆకాశగంగ వద్ద జన్మించారని స్పష్టంగా చెప్పారన్నారు.ఇందులో ఎలాంటి వివాదం లేదని ధర్మారెడ్డి వివరించారు. అయోధ్య శ్రీ రాములవారి జన్మ భూమి అని నిర్ధారణ అయిన తరువాత తిరుమల ఆకాశగంగ వద్ద ఆంజనేయుని జన్మస్థలంగా నిర్ధారణ కావడం దైవ సంకల్పమని శ్రీ ధర్మారెడ్డి చెప్పారు. ఆకాశగంగ వద్ద ఉన్న అంజనాదేవి, బాలహనుమంతుల దర్శనం కోసం భక్తులు సులువుగా వచ్చి వెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న మార్గాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.అంతకు ముందు ఆయన ఈ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి అధికారులతో సమీక్షించారు.

# షోల్డర్ యాక్నే కు గుడ్ బై చెప్పేందుకు 7 హోమ్ మేడ్ బ్లెండ్స్



షోల్డర్ యాక్నేతో డీల్ చేయడం అతి కష్టం. ఇంఫ్లేమేషన్, రెడ్ నెస్ మరియు ఇచినెస్ వలన అత్యంత అసౌకర్యం తలెత్తుతుంది. అలాగే ఎంబరాస్మెంట్ కు దారితీస్తుంది. షోల్డర్స్ పై యాక్నే సమస్య మిమ్మల్ని తరచూ వేధిస్తోందా? అయితే, ఈ ఆర్టికల్ మీ కోసమే. ఈ రోజు బోల్డ్ స్కై లో షోల్డర్ యాక్నే నుంచి ఉపశమనం పొందేందుకు నేచురల్ బ్లెండ్స్ గురించి వివరించాము. ఇవి మీకు యాక్నేకు సంబంధించిన లక్షణాల నుంచి విముక్తిని అందిస్తాయి. పసుపు, అలోవెరా జెల్ వంటి కొన్ని సహజ పదార్థాలను మరికొన్ని పదార్థాలతో కలిపి వాడితే యాక్నే సమస్యను తగ్గించడంతో పాటు చర్మాన్ని డిసిన్ఫెక్ట్ చేస్తాయి. తద్వారా, బ్రేకవుట్స్ ని నిర్మూలిస్తాయి. యాంటీ ఫంగల్ ప్రాపర్టీస్ పుష్కలంగా కలిగి ఉండటం వలన ఇవి యాక్నేకు దారితీసే బాక్టీరియాను నిర్మూలిస్తాయి. ఈ నేచురల్ ఇంగ్రీడియెంట్స్ అనేవి యాక్నేను నిర్మూలించడానికి బ్యూటీ స్టోర్స్ లో లభించే కెమికల్ ప్రోడక్ట్స్ కంటే అత్యంత సురక్షితమైనవి. షోల్డర్ యాక్నేను సమర్థవంతంగా తగ్గించే ఆల్ నేచురల్ హోంమేడ్ బ్లెండ్స్ లిస్ట్ ను ఇక్కడ పొందుబరిచాము. గమనిక: ప్రభావిత ప్రాంతంపై ఈ బ్లెండ్స్ ను అప్లై చేసేముందు సాధారణ చర్మంపై ప్యాచ్ టెస్ట్ ను చేసుకోండి. మీ చర్మానికి ఈ పదార్థాలు వలన ఎటువంటి ఇరిటేషన్ కలగటం లేదని నిర్ధారించుకున్న తరువాత వీటిని ప్రభావిత ప్రాంతంపై అప్లై చేసుకోండి. 1. పసుపు + కొబ్బరి నూనె: పసుపులో యాంటీ బాక్టీరియల్ ప్రాపర్టీస్ తో పాటు చర్మానికి పోషణనిచ్చే సుగుణాలు కూడా కలవు. ఇవి చర్మ సమస్యలను తగ్గించేందుకు అత్యంత ఉపయోగకరంగా ఉంటాయి. ఎలా వాడాలి: ఒక చిటికెడు పసుపులో అర టీస్పూన్ కొబ్బరి నూనెను కలపండి. ఈ మిశ్రమాన్ని ప్రభావిత ప్రాంతంపై అప్లై చేయండి. దీన్ని పదినిమిషాల పాటు ప్రభావిత ప్రాంతంపై ఉండనివ్వండి. ఆ తరువాత గోరువెచ్చటి నీటితో ఈ మిశ్రమాన్ని తొలగించండి. రోజులో అనేక సార్లు ఈ రెమెడీను పాటించడం ద్వారా మెరుగైన ఫలితాల్ని గమనించగలుగుతారు. 2. బేకింగ్ సోడా + రోజ్ వాటర్: బేకింగ్ సోడాలో యాంటీ సెప్టిక్ ప్రాపర్టీస్ పుష్కలంగా కలవు. రోజ్ వాటర్ తో దీన్ని కలిపితే దీనిలోని చర్మసంరక్షణ సుగుణాలు మరింత పెరుగుతాయి. ఎలా వాడాలి: చిటికెడు బేకింగ్ సోడాను ఒక టీస్పూన్ రోజ్ వాటర్ లో కలిపి మిశ్రమాన్ని తయారుచేసుకోండి. ఈ పేస్ట్ ను ప్రభావిత ప్రాంతంపై అప్లై చేయండి. అయిదు నిమిషాల తరువాత గోరువెచ్చటి నీటితో శుభ్రపరచండి. ఈ పద్ధతిని వారానికి మూడు లేదా నాలుగు సార్లు పాటిస్తే మంచి ఫలితాలను పొందవచ్చు. రాశిచక్రాల ప్రకారం అలవాటుగా చెప్పే అబద్ధాలు ఏంటో తెలుసా? పబ్లిక్ లో వర్షంలో తడుస్తూ లిప్ టు లిప్ కిస్ పెట్టుకుని మైమరచిపోయిన జంట, ఫొటోగ్రాఫర్ జాబ్ ఊడింది నిద్ర అవసరమేనా? మంచి నిద్రకి పాటించవలసిన ఆయుర్వేద చిట్కాలు 3. ఆపిల్ సిడర్ వినేగార్ + వాటర్: ఆపిల్ సిడర్ వినేగార్ లోని అసిడిక్ నేచర్ అనేది యాక్నేకు దారితీసే బాక్టీరియాను నశింపచేస్తుంది. స్కిన్ పోర్స్ ను డిసిన్ఫెక్ట్ చేస్తుంది. ఎలా వాడాలి: మూడు లేదా నాలుగు చుక్కల ఆపిల్ సిడర్ వినేగార్ లో ఒక టీస్పూన్ డిస్టిల్డ్ వాటర్ ను జోడించాలి. శుభ్రమైన కాటన్ బాల్ ను తీసుకుని ఈ బ్లెండ్ లో ముంచి దాంతో ప్రభావిత ప్రాంతంపై అప్లై చేయాలి. అయిదు నుంచి పది నిమిషాల తరువాత ప్రభావిత ప్రాంతాన్ని గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయండి. ఈ బ్లెండ్ ను రోజుకు రెండు సార్లు అప్లై చేస్తే వేగవంతమైన ఫలితాలను మీరు గుర్తించగలుగుతారు. 4. అలోవెరా జెల్ + అవొకాడో ఆయిల్: షోల్డర్ మరియు వీపుపై పైపూతగా అప్లై చేసందుకు అవొకాడో ఆయిల్ ను విరివిగా వాడతారు. దీన్ని అలోవెరా జెల్ తో జోడిస్తే అద్భుతమైన ఫలితాలను గమనించవచ్చు. ఎలా వాడాలి: ఒక టీస్పూన్ అలోవెరా జెల్ లో రెండు లేదా మూడు చుక్కల అవొకాడో ఆయిల్ ను జోడించాలి. ఈ బ్లెండ్ ను ప్రభావిత ప్రాంతంపై అప్లై చేయాలి. కొద్ది నిమిషాల పాటు ఈ మిశ్రమం ప్రభావిత ప్రాంతంపై ఉండాలి. ఆ తరువాత గోరువెచ్చటి నీటితో శుభ్రపరచాలి. దీన్ని రోజుకు ఒక్కసారి అప్లై షోల్డర్ యాక్నే సమస్య తగ్గుముఖం పడుతుంది. 5. నిమ్మరసం + ఓట్ మీల్: నిమ్మరసం మరియు ఓట్ మీల్ బ్లెండ్ అనేది స్కిన్ ఇంఫ్లేమేషన్ మరియు రెడ్ నెస్ ను తగ్గిస్తుంది. ఈ బ్లెండ్ ను తరచుగా అప్లై చేస్తే యాక్నే సమస్య తొలగిపోవడంతో పాటు యాక్నే తిరిగి తలెత్తడం కూడా అరికట్టబడుతుంది. ఎలా వాడాలి: అర టీస్పూన్ ఓట్ మీల్ మరియు ఒక టీస్పూన్ నిమ్మరసాన్ని కలిపి ఒక మిశ్రమాన్ని తయారుచేయండి.

# 'నేను చూసిన క్రికెటర్లలో అతనొక పూర్తి అథ్లెట్

భారత ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్ టీమిండియా ఆటగాడు శుబ్‌మన్ గిల్‌పై ప్రశంసలు కురిపించాడు. తాను ఇటువంటి క్రికెటర్‌ను చూడలేదంటూ కితాబిచ్చాడు. కాగా ఐపీఎల్ రాణించడంతో వెలుగులోకి వచ్చిన గిల్ జాతీయ జట్టులోనూ సత్తా చాటి తానేంటో నిరూపించుకున్నాడు. ఈ క్రమంలోనే ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ జాబితాలో గిల్ చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే.శుభమన్ గిల్ ఒక పూర్తి అథ్లెట్: భారత ఫీల్డింగ్ కోచ్‌కేవలం ఏడు టెస్టుల అనుభవంతో శుభమన్ అంతర్జాతీయ క్రికెట్‌కు చాలా కొత్తవాడనే చెపాలి. పైగా ఈ మెగా ఈవెంట్‌లో ట్రెంట్ బౌల్ట్, టిమ్ సౌతీ, నీల్ వాగ్నర్ లాంటి పేసర్లని ఎదుర్కొనే గిల్ రాణించాల్సి ఉంటుందని శ్రీధర్ తెలిపారు. గిల్ గురించి మాట్లాడుతూ.. cc అతను సన్నగా పొడవైనవాడు, గ్రౌండ్‌లోనే చురుకుగా కదలడం, బ్యాటింగ్ పద్ధతిలోనూ లోపాలు లేవు, అలాగే ఫీల్డింగ్ పరంగానూ ఆకట్టుకుంటున్నాడు. ఇలా నేను చూసిన క్రికెటర్లలో పూర్తి అథ్లెట్ అతనేనని భావిస్తున్నట్లుcc టైమ్స్ ఆఫ్ ఇండియాతో చాట్‌లో అన్నారు.ఈ నెలాఖరులో జరిగే ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత్ న్యూజిలాండ్‌తో తలపడినప్పుడు చాలా మంది కళ్ళు శుబ్‌మన్ గిల్‌పై ఉండనున్నాయి.

# డేంజరస్ గా బతకాలని చెప్తున్న పూరీ..!

డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ పోడ్ కాస్ట్ రూపంలో తన ఆలోచనలను అందరితో పంచుకుంటున్న సంగతి తెలిసిందే. cపూరీ మ్యూజింగ్స్c పేరుతో అందరినీ ఆకట్టుకుంటున్న పూరీ.. సబ్ టైటిల్స్ తో సరికొత్త సెకండ్ సిరీస్ తో వచ్చాడు. తాజాగా cలివ్ డేంజరస్లీc అనే అంశం గురించి మాట్లాడారు. జీవితంలో రిస్క్ తీసుకోవాలని.. రిస్క్ లోకి దూకడమే మన క్యారెక్టర్ అవ్వాలని.. జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండకూడదని.. సవాళ్లు ఎదుర్కొవాలని పూరీ చెబుతున్నారు. 'లివ్ డేంజరస్లీc గురించి పూరీ ఏమి చెప్పాడంటే..ccలివింగ్ డేంజరస్లీ ఈజ్ ది ఓన్లీ వే అని ఓషో లాంటి చాలా మంది చెప్పారు. రిస్క్ లేని జీవితాన్ని కోరుకోవద్దు. సెక్యూరిటీ ఇవ్వమని జీవితాన్ని అడగవద్దు. ఎలాంటి ఎత్తుపల్లాలు లేని మైదానంలో బతకాలని అనుకుంటారు అందరూ. కానీ జీవితంలో ఎత్తైన కొండలు పర్వతాలు లోయలు అనేవి ఉండాలి. రిస్క్ తీసుకోవడం.. రిస్క్ లోకి దూకడమే మన క్యారెక్టర్ అవ్వాలి. చేసే పనులెప్పుడూ ఒకే విధంగా ఉండకూడదు. అలా ఉంటే బోరింగ్ గా ఉంటుందిccccజీవితమనే కొవ్వొత్తిని రెండు వైపులా వెలిగించేద్దాం. అటు నుంచి మాత్రమే ఎందుకు కాల్చాలి. ఇటునుంచి కాల్చకూడదా అనే ఆలోచనా విధానం మనిషికి అవసరం. స్కై డైవింగ్ భయమైతే అదే చేసేయ్. ఎన్నిసార్లు దువ్వుతావ్ అదే హెయిర్ స్టైల్ ని. ఒకసారి గుండు గీసి చూడు మనశ్శాంతిగా ఉంటుంది. నువ్వు ఎప్పుడూ వేయని బట్టలు వేసుకో. ఎర్ర కళ్ళద్దాలు పెట్టుకొని రోడ్ మీద నిలబడు. సోషల్ మీడియా అకౌంట్స్ అన్నీ డిలీట్ చేసి ట్రావెల్ కి బయల్దేరు. తక్కువ డబ్బుతో ఎలా బ్రతకాలో నేర్చుకోccccనీకు ఇష్టమైంది చేసేయ్. ఇష్టంగా చేసేయ్. ఏదైతే అది అవుద్ది. తర్వాత చూసుకుందాం. రేపు చచ్చిపోతాను అనుకొని ఈరోజు ఎలా బ్రతకాలో అలా బతికేయి. జీవితాన్ని ఎప్పుడూ దూరం నుంచి చూడొద్దు. జీవితం అనే పోటీలో పాల్గొనాలి. బాగా తిను. ఆరోగ్యంగా ఉండు. రెండు రోజులు నిన్ను నువ్వు పొగుడుకోవడం మానేయి. టాలెంటెడ్ పీపుల్ ని అభినందించు. జీవితమంటే మనం ఒక్కరం మాత్రమే కాదు. మన చుట్టూ చాలామంది ఉంటారు. వాళ్లందర్నీ చూడు.. వాళ్లకంటే డేంజరేస్ గా ఏదైనా చేయగలవేమో ఆలోచించుccccఒక్కసారి ప్రయత్నించి చూడు. కొన్ని నీకు చేత కాదు అని నీకు తెలియాలి. పరుగెత్తు. కూడా ఓ కుక్కని తీసుకొని పరుగెత్తు. భయం దెయ్యం లాంటిది. అది చెప్పినట్లు అస్సలు వినొద్దు. ఆశల్ని కలల్ని ఫాలో అయిపో. కాసేపు ప్రేమించడం మానేయి. నీకు ఎవరూ లేరనుకో. నువ్వు అనాథవి అనుకో. లైఫ్ అంటేనే ఎన్నో సాహసాలతో కూడుకున్నది. బతికితే డేంజరస్ గానే బతకాలి. మొనాటనస్ లైఫ్ మనకొద్దు. లివ్ డేంజరస్లీcc అని పూరీ జగన్నాథ్ చెప్పుకొచ్చారు.




# ఫేక్ క్లబ్ ల బెడద తట్టుకోలేక లబోదిబోమన్న హీరో

గొప్ప పాపులారిటీ ఉన్న హీరోల పేరుతో ఫ్యాన్స్ క్లబ్ లు ఏర్పాటు చేయడం వాటిని సోషల్ మీడియాల్లో ప్రమోట్ చేస్తూ తమ ఫేవరెట్ స్టార్ ఫోటోలు వీడియోలు షేర్ చేస్తూ కొందరు సాగించే హంగామా తెలిసినదే. ఇందులో కొన్ని ఫేక్ అకౌంట్లు తప్పుడు సంకేతాలతో తప్పుడు వ్యవహారాలతో నానా రచ్చకు తెర తీస్తే తల బొప్పి కట్టేది హీరోకే.అందుకే ఇప్పుడు మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ లబోదిబోమంటున్నాడు. అసలు ఈ ఫేక్ క్లబ్ లు వద్దు.. నాకు ఈ ప్రచారం వద్దు మొర్రో అంటున్నాడు. అసలు తనకు ఏ ఫ్యాన్ క్లబ్ లు లేవు అంటూ విసుగెత్తిపోయాడు. వెంటనే వాటిని తొలగించాలని హుకుం జారీ చేశాడు. దుల్కర్ సల్మాన్ తన పేరు మీద నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్స్ అన్నిటినీ తొలగించాలని అతడు ఫ్యాన్స్ కి పిలుపునిచ్చాడు. నాలాగే ఫేక్ లు హల్చల్ సరికాదని అన్నాడు. ఇవిగో ఇవన్నీ ఫేక్ అంటూ కొన్నిటిపై ఫేక్ రెడ్ మార్క్ ముద్రను వేసి మరీ కొన్నిటిని అభిమానులకు తెలియపరిచాడు.సౌత్ ఎంటర్ టైన్ మెంట్ పరిశ్రమలో అగ్రశ్రేణి తారలలో దుల్కర్ సల్మాన్ కి ఉన్న ఫాలోయింగ్ అసాధారణం. తనదైన స్టైలిష్ లుక్స్ తో క్రేజీ ప్రాజెక్టులతో అతడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. అతని పేరుతో నకిలీ ప్రొఫైల్స్ దాదాపు ప్రతి రోజు సోషల్ మీడియాలో వెలుగులోకి రావడంలో ఆశ్చర్యం లేదు కానీ వాటి వల్ల పర్యవసానాలు ఎలా ఉంటాయో కూడా ఊహించగలిగేదే. ఇప్పుడు అతను తన పేరు ఫోటోలతో సోషల్ మీడియా ప్రొఫైల్స్ సృష్టించినవారిని అలా చేయడం బాలేదని వారించే ప్రయత్నం చేస్తున్నాడు. నేను క్లబ్ హౌస్ లో లేను. ఈ ఖాతాలు నావి కావు. దయచేసి నన్ను సోషల్ మీడియాలో అనుసరించవద్దు. ఇదేమీ కూల్ గా లేదు!! అని వ్యాఖ్యానించారు.దుల్కర్ తదుపరి చిత్రం సెల్యూట్ లో పోలీసుగా కనిపించనున్నారు. రోషన్ ఆండ్రూస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దయానా పెంటీ కథానాయిక.




# మంచి చేసినప్పుడు మెచ్చుకోవాల్సింది పోయి.. ఈ నెగెటివ్ కామెంట్స్ ఏంటో..!

సూపర్ స్టార్ మహేష్ బాబు యొక్క సేవాగుణం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అనేక సేవా కార్యక్రమాలతో రీల్ లైఫ్ లోనే కాదు రియల్ లైఫ్ లో కూడా హీరో అనిపిస్తున్నారు. ఆంధ్రా హాస్పిటల్స్ తో కలిసి 1000 మందికి పైగా చిన్నారులకు గుండె ఆపరేషన్స్ చేయించిన మహేష్.. 'హీల్ ఎ చైల్డ్ ఫౌండేషన్‌వ సంస్థతో కలిసి వైద్య ఖర్చులు భరించలేని ఎంతో మంది చిన్నారుల కుటుంబాలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారు. అలానే ఆంధ్రప్రదేశ్ లో బుర్రిపాలెం మరియు తెలంగాణలోని సిద్ధాపురం గ్రామాలను దత్తత తీసుకున్న మహేష్.. అనేక అభివృద్ధి కార్యక్రమాలతో cశ్రీమంతుడుc అనిపించుకున్నాడు.



ఈ క్రమంలో నేడు తన తండ్రి కృష్ణ పుట్టినరోజు కావడంతో మరో మంచి పనికి పూనుకున్నారు మహేష్.మహేష్ బాబు తన స్వగ్రామమైన బుర్రిపాలెంలోని ప్రజలందరికీ ఉచితంగా కోవిడ్ వ్యాక్సిన్ పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో సినీ రాజకీయ ప్రముఖులు అభిమానులు సోషల్ మీడియాలో మహేష్ ను అభినందిస్తున్నారు. అయితే మరికొందరు నెటిజన్స్ మాత్రం మహేష్ ప్రయత్నాన్ని మెచ్చుకివాల్సింది పోయి నెగెటివ్ కామెంట్స్ పెడుతున్నారు. ఒక్క రోజులో ఊరి మొత్తానికి వాక్సిన్ ఎలా వేయగలని కొందరు అంటుంటే.. ఒక్క ఊరికి వేస్తే సరిపోతుందా అని మరికొందరు అంటున్నారు. వ్యాక్సిన్ ఫస్ట్ డోస్ ఇస్తున్నారు సరే.. రెండో డోస్ సంగతి ఏంటని వంకలు పెడుతున్నారు. అయితే ఆంధ్రా హాస్పిటల్స్ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఆరు రోజుల జరగనుందని మహేష్ టీమ్ తెలిపింది.బుర్రిపాలెం గ్రామంలో ఉన్న మొత్తం 12 వార్డులలో వ్యాక్సిన్ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్న ప్రజలందరికీ ఇస్తామని వెల్లడించారు. అలాగే మొదటి డోసు వ్యాక్సిన్ వేయించుకున్న వారికి రెండవ డోసు ఇచ్చే ఏర్పాట్లు కూడా మహేష్ చెయ్యనున్నారని వివరణ ఇచ్చారు. మంచి పనులు ఎవరు చేసినా అభినందించాలి అంటుంటారు. కానీ సోషల్ మీడియాలో అది పెద్దగా కనిపించదు. మెచ్చుకునే వారి కంటే వంకలు పెట్టేవాళ్ళు ఎక్కువ మంది ఉంటారనేది వాస్తవం. ఇటీవల మెగాస్టార్ చిరంజీవి కరోనా కష్ట కాలంలో ఆక్సిజన్ బ్యాంకులు ఏర్పాటు చేస్తుంటే.. సోనూ సూద్ తో కంపేర్ చేస్తూ నెగెటివ్ కామెంట్స్ పెట్టనవాళ్ళు చాలా మందే ఉన్నారు.

# రవితేజ తో సినిమా ప్లాన్ చేస్తున్న రామ్ చరణ్..?

ఇటీవల టాలీవుడ్ లో ఎక్కువగా వార్తల్లో నిలిచిన మలయాళ చిత్రం cడ్రైవింగ్ లైసెన్స్c. పృథ్వీరాజ్ – సూరజ్ ప్రధాన పాత్రలతో తెరకెక్కిన ఈ సినిమా.. రెండేళ్ల క్రితం వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఏడాది క్రితమే న్యూస్ వచ్చింది. ఈ సినిమాపై ముచ్చటపడిన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ స్వయంగా రీమేక్ రైట్స్ తీసుకున్నారని టాక్ వచ్చింది. కానీ ఇంతవరకు దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. cడ్రైవింగ్ లైసెన్స్c సినిమా ఓ హీరో మరియు అతన్ని అభిమానించే ఓ బ్రేక్ ఇన్ స్పెక్టర్ మధ్య అనుకోని పరిస్థితుల వల్ల ఏర్పడిన గొడవ నేపథ్యంలో రూపొందింది. తెలుగు రీమేక్ లో పవన్ కళ్యాణ్ – రామ్ చరణ్ హీరోలుగా నటిస్తున్నారని.. కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఈ మల్టీస్టారర్ తెరకెక్కనుందని ప్రచారం కూడా జరిగింది. ఆ తర్వాత ఒక పాత్రలో మాస్ మహారాజా రవితేజ నటించనున్నారని టాక్ వచ్చింది. అయితే ఇప్పుడు తాజాగా ఫిలిం సర్కిల్స్ లో వినిపిస్తున్న టాక్ ప్రకారం రవితేజ ను ఆల్మోస్ట్ ఫైనలైజ్ చేశారని అంటున్నారు.పృథ్వీరాజ్ పోషించిన స్టార్ హీరో పాత్రను తెలుగులో రవితేజ తో చేయించాలని రామ్ చరణ్ ఫిక్స్ అయ్యారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే కనుక నిజమైతే నటనకు మంచి స్కోప్ ఉన్న రోల్ కావడంతో మాస్ రాజాకి మంచి గుర్తింపు తెచ్చే అవకాశం ఉంది. అయితే గతంలో రవితేజ చేసిన మలయాళ రీమేక్ cనా ఆటోగ్రాఫ్c నిరాశపరిచింది. ఇప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ తో సక్సెస్ అందుకుంటాడేమో చూడాలి.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**